నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
సోమవారం | మార్చి 11, 2024 | www.navatelangana.com

షబ్బీర్ అలీని కలిసిన జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్



నవతెలంగాణ-రామారెడ్డి

ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీని జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు గీరెడ్డి మహేందర్‌రెడ్డి ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కామారెడ్డి నియోజకవర్గంలోని రామారెడ్డి మండలంలోని గ్రామాలకు ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధికి సహకరించాలని కోరగా, సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా మహమ్మద్ షబ్బీర్ అలీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఏటీఎం మిషన్ ధ్వంసం



- నగదు సేఫ్

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని బస్వాపూర్ గ్రామంలో కెనరా బ్యాంక్ ఏటీఎం మిషన్‌ను గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేసి నగదును అపహరించే ప్రయత్నం చేసిన ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కెనరా బ్యాంక్ ఏటీఎం మెషిన్‌లో 7వ తేదీ గురువారం నాడు డబ్బులు పెట్టి వెళ్లగా ఎలాంటి ట్రాన్స్‌శాక్షన్స్ జరగకపోవడంతో హెడ్ ఆఫీస్ నుంచి బ్యాంక్ మేనేజర్‌కు సమాచారం అందజేశారు. బ్యాంక్ మేనేజర్ ఏటీఎం మిషన్ వద్దకు వెళ్లి చూడగా మిషన్ ధ్వంసం చేసి ఉండగా నగదును పరిశీలించారు. నగదు చోరీ జరగకపోవడంతో ధ్వంసమైన విషయాన్ని పోలీసులకు సమాచారం అందజేసి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎండుతున్న పంటలు.. కన్నీరు పెడుతున్న రైతులు..

- బీర్కూర్, నసురుల్లాబాద్ మండలాలకు అందని నిజాంసాగర్ నీరు
- అధికారుల సమన్వయ లోపమే కారణం..?
- లైట్ తీసుకుంటున్న ఉన్నతాధికారులు..
- గాంధారిలో అడుగంటిన భూగర్భజలాలు
- వట్టిపోతున్న బోర్లు
- ఎండుతున్న పంటలు



బీర్కూర్ మండలంలో నీరందకపోవడంతో ఎండిపోతున్న వరి పంట



గాంధారి మండలంలో నీరు లేక వాడిపోయిన మొక్కజొన్న పంట

నవతెలంగాణ-నసురుల్లాబాద్/గాంధారి

కామారెడ్డి జిల్లా బీర్కూర్, నసురుల్లాబాద్ మండలాల్లోని పంటలకు సాగునీరు సరిపోయేలా అందడం లేదు. అందుకు ఇరిగేషన్ అధికారులు, సిబ్బంది సమన్వయలోపమే కారణం. నిజాంసాగర్ చివరి ఆయకట్టుకు సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రాజెక్టులో నీరున్నా పంటలు ఎండిపోయే పరిస్థితులు నెలకొన్నాయి. ఇక గాంధారి మండలంలో భూగర్భజలాలు ఎత్తిపోవడంతో బోర్లు వట్టిపోతున్నాయి. తద్వారా పంటలకు నీరందక ఎండిపోతున్నాయి.

బాన్సువాడ డివిజన్‌లోని బీర్కూర్, నసురుల్లాబాద్ మండలంలో చెరువు కట్టల కింద పంట సాగు చేస్తున్న రైతులు పంట నష్టపోయే ప్రమాదం ఏర్పడింది. ప్రధానంగా బీర్కూర్ మిర్జాపూర్, కిష్టాపూర్ దామరాంచ, గ్రామ శివారులో వరి పంటలకు నీళ్లందక ఎండిపోతున్నాయి. పొలాలు నెర్రెలు బారుతుండగా, పలు గ్రామాల్లో మక్క పూర్తిగా కంకులు వేయడంలేదు. దీనికి జిల్లా, డివిజన్ అధికారుల నిర్లక్ష్యం, కిందిస్థాయిలో సిబ్బంది కొరతే కారణమని రైతు నేతలు ఆరోపిస్తున్నారు.

లైట్ తీసుకున్న ఉన్నతాధికారులు..

నిజాంసాగర్ పరిధిలో ప్రధాన కాల్వ కింద ఆయకట్టు కింద గొలుసు కట్టు చెరువులున్నాయి. చెరువులు నిల్వ చెయ్యడంలో అధికారులు విఫలం కావడంతో పంటలు ఎండుతున్నాయి. సాగునీటి అధికారులు, కిందిస్థాయి సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. నియోజకవర్గ పరిధిలో ఉన్న రైతులకు, వ్యవసాయ శాఖ అధికారులతో సాగునీటి అధికారుల సమన్వయం చేయాల్సిన సాగునీటి ఉన్నతాధికారులు లైట్ తీసుకుంటున్నారు. ఆయకట్టు ముందున్న తూములు, కాల్వల ద్వారా నీరు వృథాగా పోవడం, చివరలో ఉన్న భూములకు నీరందకపోవడం వంటి సమస్యలు వచ్చాయంటున్నారు.

నిజాంసాగర్ ప్రధాన కాలువ ఆయకట్టు కింద ఉన్న గొలుసు కట్టు చెరువులకు నీరు చేరకపోవడంతో చెరువుల్లో నీరు లేకపోవడంతో బీర్కూర్ నల్లచెరువు ఆయకట్టు కింద ఉన్న వరి పంటలు ఎండిపోవడంతో రైతులు కంటతడి పెడుతున్నారు. చెరువు కట్ట తూము శిథిలావస్థకు చేరడం, తూముల్లో పూడికచేరి నీరు బయటకు రాక, ఆ తూము కింద ఉన్న ఆయకట్టు భూములు ప్రస్తుతం ఎండు దశకు చేరుతున్నాయి. ఇప్పటికే పొలాలన్నీ నెర్రెలు వేసాయి. పొట్ట దశలో నీరు అందక పంటలు ఎండడానికి సిద్ధంగా ఉండడంతో, అన్నదాత కంట నీరు పెడుతున్నారు. శిథిలావస్థకు చేరిన తూము నుంచి నీటిని బయటకు తీసుకురావడానికి తూముల్లో ఉన్న చెత్తను తొలగిస్తున్నారు రైతులు. అన్నదాతలు కష్టపడుతున్నప్పటికీ సాగునీటి పారుదల శాఖ అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం రైతులకు శాపంగా మారింది. మరో వారం రోజుల్లో నీరు అందకుంటే నల్లచెరువు తూము ఆయకట్టు కింద ఉన్న వందల ఎకరాల వరి పంట చేతికి రాకుండా పోతుందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, అధికార పార్టీ నేతలు స్పందించి వెంటనే, తూము బాగు చేయించి ఎండుతున్న పంటలకు సాగునీరు అందే విధంగా చర్యలు తీసుకోవాలంటూ రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

అడుగంటుతున్న భూగర్భ జలాలు

గాంధారి : రోజురోజుకూ భూగర్భజలాలు అడుగంటిపోతుండటంతో రైతులు దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు. పంటలు చివరిదశలో బోరు బావులు ఎత్తిపోయి పంటకు నీరందక ఎండిపోవడంతో ఎలా కాపాడుకోవాలో తెలియక ఆందోళన చెందుతున్నారు. కండ్ల ముందే పంట ఎండిపోతుండటంతో కంట నీరు పెట్టుకోవడం తప్ప ఏమి చేయలేని పరిస్థితిలో ఉన్నారు.



గాంధారి మండలంలో ఎండిపోయిన వరి పంట

గాంధారి మండలాల్లోని ఆయా గ్రామాల్లో వేసిన వరి, మొక్కజొన్న పంటలు బోరు బావులు ఎత్తిపోవడంతో నీరు లేక ఎండిపోతున్నాయి. ఖరీఫ్ సీజన్ ఆఖర్లో వర్షాలు పుష్కలంగా కురిసి చెరువులు పూర్తిగా నిండాయి. దీంతో రైతులు రబీ సీజన్లో చెరువులు, కుంటల్లో పుష్కలంగా నీళ్లు ఉన్నాయన్న ఆశతో బోరు బావుల వద్ద వరి పంటలను సాగు చేశారు. కానీ చెరువులు, కుంటలోని నీరు పూర్తిగా అడుగంట పోవడంతో బోరు ఎత్తిపోయి నీళ్ల లేక పంటలు ఎండిపోతున్నాయి. మండలాల్లో ఎక్కువశాతం రైతులు బోరు బావులపైనే ఆధారపడి వరి పంటలను వేశారు. కానీ వరి, మొక్కజొన్న పంటలు మాత్రం రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ప్రస్తుతం భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో బోరుబావులు పూర్తిగా ఎత్తిపోయాయి. దీంతో వేసిన పంటలు చేతికొస్తాయో లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో వేసిన పంటలు దక్కించుకోవడానికి రైతులు నానా అవస్థలు పడుతున్నారు. వర్షాలు అక్టోబర్ నెలలోనే బంద్ కావడంతో భూగర్భ జిల్లా అడుగంటి పోవడంతో బోర్లు సమృద్ధిగా పోస్తాయన్న ఆశతో రైతులు రబీలో పంటలు సాగు చేశారు. తీరా పంటలు చేతికొచ్చే దశలో బోర్లు ఎత్తిపోవడంతో వేసిన పంటలు దక్కించుకోవడానికి రైతులు నానా అవస్థలు పడుతున్నారు. లక్షలు ఖర్చుపెట్టి కొత్త బోర్లు వేయిస్తున్నారు. పంటలు దక్కించుకోడానికి రైతులు 600, 700 ఫీట్ల వరకు బోర్లు తవ్విస్తున్నారు. బోరు బండ్ల కోసం రైతులు నానా అవస్థలు పడుతున్నారు. చిన్న సన్నకారు రైతులు చేసేదేమీ లేక ఉన్న బోర్లు నీళ్ల పోయకపోవడంతో పంటలను వదిలేస్తున్నారు.

లక్షలాది రూపాయలు ఖర్చు చేసిన రైతు పంట చేతికొచ్చే సమయంలో బోర్లు ఎత్తిపోవడంతో తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

మృత్యువుకు కేరాఫ్.. నిజాంసాగర్ కెనాల్..

- ప్రతియేడు ఇద్దరు లేదా ముగ్గురు మృత్యువాతపడుతున్న వైనం
- కెనాల్ వద్ద ప్రమాద సూచిక బోర్డులు లేవు
- ప్రమాదాలకు గురికాకుండా అధికారుల సూచనలు కరువు



గల్లంతైన వారికోసం గాలింపు చేపడుతున్న పోలీసు బలగాలు

నవతెలంగాణ-వర్ని

నిజాంసాగర్ ప్రధాన కాలువ మృత్యువుకు కేరాఫ్‌గా మారుతోంది. శనివారం సైతం నిజాంసాగర్ ప్రధాన కాలువలో ముగ్గురు గల్లంతైన విషయం తెలిసిందే. పంటల సాగుకోసం నీటిని విడుదల చేసినప్పుడల్లా.. తెలిసీ తెలియక యువకులు తమ నిండు ప్రాణాలను పోగొట్టుకుంటున్నారు. సరదాగా ఈత కోసం వెళ్లి కొందరు.. స్నానం కోసం వెళ్లి ఇంకొందరు.. కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లి మరి కొందరు ఇలా.. తమ ప్రాణాలను పోగొట్టుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు కాలువ వద్ద ఎలాంటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం లేదు. అలాగే నిజాంసాగర్ కాలువ ద్వారా నీటిని విడుదల చేసినప్పుడు 'కాలువ వద్దకు వెళ్లొద్దు' అనే సమాచారాన్ని కూడా ప్రజలకు చేరవేయకపోవడం గమనార్హం.

నిజాంసాగర్ ప్రధాన కాలువ కింద బాగానికి పంట సాగు కోసం నీరు వదలినప్పుడల్లా ఏడాదికి ఇద్దరు లేదా ముగ్గురు పలు తమ నిండు ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. ఇందుకు కారణం ప్రధాన కెనాల్ పూర్తిగా సీసీ చేయటమేనని తెలుస్తోంది. మలవిసర్జనకు వెళ్లి కాలుజారి పడికొట్టుకుపోయిన ఘటనలు కోకొల్లలు. రెండు వైపులా సీసీ వేయడంతో అది నీటిని విడుదల చేసినప్పుడు పాకురు పట్టి ఆ ప్రాంతం వద్దకు వెళ్లినప్పుడు పట్టు లేక జారిపడి కొట్టుకుపోతున్నారు.

గతంలోనూ ప్రమాదాలు..

2020 సంవత్సరంలో ఇంటర్ విద్యార్థులు ఆనందంగా ఉత్సాహంగా స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లారు. ఈత రాని వారు కూడా వెళ్లి నీట మునిగి ప్రాణాలు పోగొట్టుకున్నారు. అలాగే ఈ మధ్య కాలంలోనే వృద్ధులు, తదితరులు కాలుజారి పడి మృతి చెందిన ఘటనలు సైతం ఉన్నాయి.

ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు సూచనలు అవసరం..

ప్రతియేడాది ఇలా ప్రమాదాలు జరిగి కుటుంబానికి అండగా ఉండాలసిన వారు కాలువలో నిండు ప్రాణాలను పోగొట్టుకుంటున్నారు. నీటిని విడుదల చేసే సమయంలో నీటి పారుదల, రెవెన్యూ శాఖల అధికారులు కాలువ వద్దకు వెళ్లొద్దనే సమాచారాన్ని ప్రజలకు చేరవేయాలి. కానీజీ శాఖ అధికారులు అవేమీ పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. రైతుల పంట సాగు కోసం నిజాంసాగర్ నీటిని వదిలిన సమయంలో ప్రమాద హెచ్చరికలు, సూచనలు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఈ గ్రామాల మీదుగా కాలువ..

అంకోల్, నసురుల్లాబాద్, తగిలేపల్లి, కోటయ్యక్యాంప్, ఎస్ఎన్ పురం, జాకోరా, పొట్టి గుట్ట తండా, సంకోరా, వకీల్‌ఫారం, ఆపందిఫారం, చందూర్, తిమ్మాపూర్, చింతకుంట, ఇలా అనేక గ్రామాల నుంచి నిజాంసాగర్ ప్రధాన కాలువ ఉంది. ముఖ్యంగా ఈ గ్రామాల ప్రజలకు నిజాంసాగర్ కాలువ ద్వారా నీటిని విడుదల చేసినప్పుడు సమాచారాన్ని చేరవేయాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే కాలువ వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు సైతం ఏర్పాటు చేయాలని అంటున్నారు.

గల్లంతైన ఇద్దరి మృతదేహాలు లభ్యం



నిజాంసాగర్ ప్రధాన కాలువలో ఇద్దరు యువకులు, ఒక వ్యక్తి శనివారం మధ్యాహ్నం గల్లంతైన విషయం తెలిసిందే. అయితే ఆదివారం వారి ఆచూకీ కోసం పోలీసు బలగాలు గాలింపు చేపట్టగా.. చందూర్ మండల కేంద్రానికి చెందిన విష్ణు (21), వర్ని మండలంలోని అపందిఫారం గ్రామానికి చెందిన నారాయణ (22) యువకుల మృతదేహాలు పలుచోట్ల లభించాయి. విజయ్ (50) ఆచూకీ లభించకపోగా గాలింపు చేపట్టారు. లభించిన మృతదేహాలను బోధన్ ప్రభుత్వ ఆసుపత్రికి పంచనామా నిమిత్తం కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు తరలించినట్లు ఎస్సై కృష్ణకుమార్ తెలిపారు.

భూసాధన సభకు తరలిరావాలి

- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నర్సింలు



మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నర్సింలు

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని జంగంపల్లి గ్రామంలో జరిగే భూసాధన సభకు తరలిరావాలని అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ కార్యదర్శి బి.వెంకట్ రానున్నారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నర్సింలు తెలిపారు. ఈ నెల 13వ తేదీన జిల్లాలోని పోడు భూములు, ఇండ్ల స్థలాల సాధన కోసం జరిగే భూసాధన సభకు ముఖ్యఅతిథిగా అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి వెంకట్, రాష్ట్ర కార్యదర్శి ఆర్.వెంకట్ రాములు, సహాయ కార్యదర్శి పద్మ, జిల్లా నాయకులు వెంకట్‌గౌడ్, చంద్రశేఖర్ హాజరు కానున్నట్లు తెలిపారు. కామారెడ్డి జిల్లాలో వేల ఎకరాలు ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు అన్యాక్రాంతమయ్యాయని, కొన్ని ప్రభుత్వ భూములను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించి ప్లాట్లుగా విక్రయించారన్నారు. జంగంపల్లి గ్రామంలో పేద ప్రజలు గత 15, 16 సంవత్సరాలుగా పోరాటం కొనసాగిస్తున్నారని తల దాచుకునేందుకు స్థలం కోసం రెండు సంవత్సరాలుగా ప్రభుత్వం ఇచ్చిన పట్టా సర్టిఫికెట్లతో కేటాయించిన స్థలంలో నివాసం ఉంటూ ఈ స్థలంలోనే జీవనం కొనసాగిస్తున్నారు. ఈ పోరాట కేంద్రాన్ని సందర్శించడానికి అఖిలభారత నాయకులు రానున్నారన్నారు. జిల్లాలో ఉన్న పోడు భూములు ఇండ్ల స్థలాలు, కార్మికులు కర్షకులు సాధన కోసం అందరు పాల్గొని ఈ సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బేరం నర్సవ్వ, చంద్రకళ, నర్సింలు, దేవరాజ్, రవి, జయ, బాలా హంస, చంద్రకళ, బాబు, తదితరులు పాల్గొన్నారు.

కేబుల్ వైర్ల దొంగకు దేహశుద్ధి

నవతెలంగాణ-భిక్కనూర్

వ్యవసాయ బావుల వద్ద కేబుల్ వైర్లను దొంగతనం చేస్తూ తప్పించుకుని తిరుగుతున్న దొంగలను ఆదివారం స్థానికులు పట్టుకొని విద్యుత్ పోల్‌కు కట్టేసి దేహశుద్ధి చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. భిక్కనూరు పట్టణానికి చెందిన రాజు, అర్జున్ ఇద్దరి యువకులు వ్యవసాయ బావుల వద్ద కేబుల్ వైర్లను కట్ చేసి వైర్లను కాల్చిన తర్వాత అందులోని కాపర్ వైర్‌ను అమ్ముతుంటారు. తరచూ బావుల వద్ద విద్యుత్ వైర్ దొంగతనం జరగడంతో ఆదివారం దొంగలించిన విద్యుత్ వైర్లు కాలుస్తుండగా స్థానికులు పట్టుకొని విద్యుత్ పోలుకు కట్టేసి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు.

ధ్వంసమైన యూనివర్సిటీలను పునర్ నిర్మించాలి

- ఉన్నత విద్యారంగాన్ని అభివృద్ధి చేయాలంటే విద్యాశాఖకు మంత్రిని కేటాయించాలి
- రాజకీయ జోక్యం లేకుండా వైస్ ఛాన్సలర్‌లను నియమించాలి
- వక్త ప్రొఫెసర్ పున్నయ్య



మాట్లాడుతున్న వక్త ప్రొఫెసర్ పున్నయ్య

నవతెలంగాణ-డిచ్‌పల్లి

రాష్ట్రంలో ధ్వంసమైన యూనివర్సిటీలను రాష్ట్ర ప్రభుత్వం పునర్ నిర్మించాలని, ఉన్నత విద్యారంగాన్ని అభివృద్ధి చేయాలంటే విద్యాశాఖకు మంత్రిని కేటాయించాలని, రాజకీయ జోక్యం లేకుండా యూనివర్సిటీలకు వైస్ ఛాన్సలర్‌లను నియమించే విధంగా ప్రభుత్వం ప్రత్యేక కృషి చేయాలని వక్తలు అభిప్రాయపడ్డారు. ఆదివారం తెలంగాణ యూనివర్సిటీలో రెండవ రోజు తెలంగాణ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ పున్నయ్యతో వర్తమాన రాజకీయాలు ఉన్నత విద్యారంగంలో సవాళ్లు అనే అంశంపై మాట్లాడారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఆర్.ఎల్.మూర్తి, నాగరాజు మాట్లాడుతూ.. రాష్ట్రంలో అన్ని యూనివర్సిటీలలో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్‌టీచింగ్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని, యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తిని పరిరక్షించే విధంగా చర్యలు చేపట్టాలని వారన్నారు. అదేవిధంగా ప్రతి యూనివర్సిటీలో మౌలిక సౌకర్యాలను మెరుగుపరచాలని, యూనివర్సిటీల అభివృద్ధి కోసం ఐదు వేల కోట్ల నిధులను కేటాయించాలని కోరారు. ప్రతి పరిశోధక విద్యార్థికి ఫెలోషిప్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించడంలో విఫలమయ్యాయని, ఇప్పటికైనా ప్రతి పరిశోధక విద్యార్థికి ఫెలోషిప్లు అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్రం తీసుకోవచ్చిన నూతన జాతీయ విద్యా విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో రద్దుకు తీర్మానం చేయాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని ప్రైవేటు యూనివర్సిటీలలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల వర్గాలకు రిజర్వేషన్లను కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. ఈ కన్వెన్షన్‌లో 26 మందితో కన్వీనింగ్ కమిటీని ఎన్నుకున్నారు. యూనివర్సిటీల కన్వీనర్‌గా ఉస్మానియా యూనివర్సిటీ నాయకురాలు మమత ఎన్నికయ్యారు. కోకన్వీనర్లుగా ప్రసాద్, ఆంజనేయులు, పవిత్రను ఎన్నుకున్నారు. అంతర్జాతీయ గీతంతో కన్వెన్షన్ ముగింపు పలికారు. ఈ సమావేశంలో 12 తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ సూరి, ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శి రమేష్ బాబు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి మమత, ఎస్ఎఫ్ఐ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి బోడ అనిల్, రాష్ట్ర కమిటీ సభ్యులు భరత్, ఉస్మానియా యూనివర్సిటీ కార్యదర్శి రవినాయక్, తెలంగాణ యూనివర్సిటీ కార్యదర్శి ప్రసాద్, రాష్ట్ర కమిటీ సభ్యురాలు సంధ్య రెడ్డి, దీపిక, జిల్లా ఉపాధ్యక్షులు మహేష్, నాగరాజు, బోధన్ డివిజన్ కార్యదర్శి సాయికుమార్, యూనివర్సిటీ నాయకులు దినేష్, చిత్రు, పవన్ తదితర నాయకులు పాల్గొన్నారు.

గతం వద్దు.. భవిష్యత్తు గురించి ఆలోచిద్దాం

- సూర్యుడు మబ్బుల చాటుకు వెళ్తేనే సూర్యుని విలువ తెలుస్తోంది
- మూడు తొమ్మిదులు పోయాయి రెండు లక్షల రుణమాఫీ లేదు
- మాయమాటలతో ప్రజలు మోసపోయారు
- మార్చి 17తర్వాత ప్రజల్లోకి వెళ్దాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు



మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

నవతెలంగాణ-కామారెడ్డి

ప్రస్తుతం మనం గతం గురించి మాట్లాడుకోవద్దని.. భవిష్యత్తు గురించి ఆలోచిద్దామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. ఆదివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని సత్య గార్డెన్‌లో నియోజకవర్గస్థాయి కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడుతూ.. బీఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్‌లోకి వెళ్తున్నారని ఏ కార్యకర్త కూడా దిగులు చెందవలసిన అవసరం లేదని ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన గంప గోవర్ధన్ మీకు అండగా ఉన్నారు, ఉంటారని తెలిపారు.

వివరాలు మెయిన్‌లో..

రైలు మార్గం ఉన్న చోట అభివృద్ధి సాధ్యం

- జహీరాబాద్ పార్లమెంట్ స్వతంత్ర అభ్యర్థి గుర్రపు మచ్చేందర్



మాట్లాడుతున్న మచ్చేందర్

నవతెలంగాణ-నిజాంసాగర్

రైలు మార్గం ఉన్న చోట అభివృద్ధి సాధ్యమని జహీరాబాద్ పార్లమెంట్ స్వతంత్ర అభ్యర్థి గుర్రపు మచ్చేందర్ అన్నారు. ప్రజలను చైతన్య పరచడానికి సైకిల్ జన చైతన్య యాత్రను చేపట్టినట్లు ఆయన తెలిపారు. నారాయణఖేడ్ నియోజకవర్గంలోని సిర్గాపూర్ గ్రామం నుంచి సైకిల్ యాత్రను ఆయన రెండు రోజుల ముందు ప్రారంభించగా.. యాత్ర ఆదివారం నిజాంసాగర్ మండలంలోని నర్సింగ్‌రావు పల్లి చౌరస్తా వద్దకు చేరుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తాను అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ ఉండేవాడినని, కానీ నాకు దేశానికి, పేద ప్రజలకు నా వంతు సేవ చేయాలనే ఉద్దేశంతో అమెరికా నుంచి ఉద్యోగం మానేసి వచ్చానని ఆయన తెలిపారు. బోధన్ టు బీదర్ రైలు మార్గం కేవలం పేపర్‌కు మాత్రమే పరిమితమైందని ఆయన గుర్తు చేశారు. రైలుమార్గం ఉన్నచోట అభివృద్ధి జరుగుతుందని ఆయన తెలిపారు. ప్రజలందరూ కూడా ఇంతకుముందు పాలన చేసిన నాయకులు ఏం అభివృద్ధి చేశారో గుర్తు చేసుకుని ఓటు వేయాలని ఆయన సూచించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
సోమవారం | మార్చి 11, 2024 | www.navatelangana.com

బిజెపి సభ్యత్వానికి రాజీనామా

- లంబాడ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడి వెల్లడి

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

బిజెపి పార్టీకి సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్టు జిల్లా లంబాడ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు జక్రాన్ పల్లి మండలం నల్లగుట్ట తండా మాజీ సర్పంచ్ మోహన్ నాయక్ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గతంలో ఎమ్మెల్యే ఎలక్షన్లో బిజెపి పార్టీకి పనిచేయడం జరిగిందని, ఇకనుంచి ఏ పార్టీలో చేరనని అన్నారు. కేవలం లంబాడి జాతి అభ్యున్నతికి శ్రేయస్సు కొరకు మాత్రమే పని చేస్తానని తెలిపారు. లంబాడి జాతి మంచి చెడుల కొరకు అన్ని పార్టీలతో కలిసి పని చేస్తానని, లంబాడి జాతిని అభివృద్ధి కొరకు కృషి చేస్తానని అన్నారు.

తాహెర్‌బిన్ హందాన్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-మోపాల్

ఉర్దూ అకాడమీ చైర్మన్‌గా నియమింపబడ్డ తాహెర్‌బిన్ హందాన్‌ను మండలంలోని బొర్గం (పి) గ్రామంలో ఆయన నివాసంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు, మోపాల్ మండల మాజీ కాంగ్రెస్ అధ్యక్షుడు బున్నే రవి ఆదివారం కలిశారు. శాలువా తో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాహెర్ భాయ్ ఇలాంటి మరెన్నో పదవులు పొందుతూ ఇంకా ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో జిల్లా అధ్యక్షుడిగా జిల్లాకు ఒక రథసారధిగా ఉండి పార్టీని బలోపేతం చేసిన నాయకుడని అన్నారు. ఆయన సేవలను గుర్తించి కార్పొరేషన్ పదవి అప్పజెప్పడం చాలా శుభదినం అని వారు తెలిపారు కాంగ్రెస్ పార్టీలో కష్టపడ్డ వారికి కచ్చితంగా గుర్తింపు ఉంటుందని వారు తెలిపారు.

సిమెంటు రోడ్డు పనులు ప్రారంభం


భూమిపూజ చేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని నాగపూర్ గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన రెండు సిమెంటు రోడ్డు పనులను ఆదివారం ప్రారంభించారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ నాయకులు భూమి పూజ నిర్వ హించి సిమెంట్ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ముత్యాల సునీల్ కుమార్ సహకారంతో గ్రామంలోని రెండు కాలనీల్లో సిమెంట్ రోడ్డు పనులకు గాను రూ. 5 లక్షలను ప్రభుత్వం మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ నిధులతో సిమెంట్ రోడ్డు పనులను చేపట్టినట్లు వారు వివరించారు. గ్రామంలో సిమెంట్ రోడ్ల నిర్మాణం కోసం నిధులు సమకూర్చిన బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ముత్యాల సునీల్ కుమార్‌కు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, సునీల్ యువసేన నాయకులు కతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వేముల గంగారెడ్డి, కిసాన్ కేత్ జిల్లా నాయకులు పడిగల ప్రవీణ్, అవారి సత్యనారాయణ, బోనగిరి లక్ష్మణ్, నాగపూర్ మాజీ ఉపసర్పంచ్ కప్పదండి అశోక్, సునీల్ యువసేన నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

భారీగా రేషన్ బియ్యం పట్టివేత


రేషన్ బియ్యంను పట్టుకున్న అధికారులు

నవతెలంగాణ-(వేల్పూర్)ఆర్మూర్

మండల కేంద్రంలోని వజ్ర రైస్ మిల్లులో శనివారం అర్ధరాత్రి సుమారుగా 120 టన్నుల రేషన్ బియ్యాన్ని అధికారులు పట్టుకున్నారు. స్థానిక ఎస్సై వినయ్ కుమార్ ఆదివారం వివరాలను వెల్లడించారు. ఎన్‌ఫోర్స్ మెంట్ ఏసీపి విష్ణుమూర్తి, స్థానిక పోలీసులు దాడి చేసి వజ్రా రైస్ మిల్లులో అక్రమంగా దాచిన రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు పేర్కొన్నారు. ఈ రైస్ మిల్‌పై దాడి చేసే సమయానికి బియ్యం లోడుతో రెండు పెద్ద లారీలు, మరో రెండు లారీల వరకు నిల్వ ఉంచిన రేషన్ బియ్యం ఉన్నాయన్నారు. సివిల్ సప్లై ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్ ఫోర్స్ ఓ ఎస్‌డి శ్రీధర్ రెడ్డి, వజ్ర రైస్ మిల్ కు వచ్చి రేషన్ బియ్యాన్ని పరిశీలించి అంచనా వేశారన్నారు. పట్టుకున్న బియ్యం సుమారుగా 120 టన్నులు ఉంటుందని పేర్కొన్నారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని మాక్లూర్ లోని సాయి కష్ణ రైస్ మిల్ కు తరలించి అక్కడ తూకం వేయించి మొత్తం ఎన్ని టన్నులు వస్తుందో నిర్ధారిస్తామన్నారు.. రైస్ మిల్ యజమాని సాయి కష్ణ గౌడ్‌పై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఆయన వెంట డిప్యూటీ తాసిల్దార్ వినోద్, శ్రీనివాస్, విడి ఆర్ఐ మహేష్, ఆర్ఐ వేణు తదితరులున్నారు.

జర్నలిస్ట్ కాలనీలో

స్వచ్ఛ కాలనీ, సమైక్య కాలనీ కార్యక్రమం

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలో జర్నలిస్ట్ కాలనిలో అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛ కాలనీ సమైక్య కాలనీ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా 37వ వారం కాలనీలోని రోడ్డు నెంబర్ ఎనిమిది నుంచి రోడ్డు నెంబర్ పది మధ్యలో శ్రమదానం చేశారు. రోడ్డుపై ఉన్న చెత్తాచెదారాన్ని చీపుర్లతో ఊడ్చి చెత్తను, వ్యర్థాలను కాల్చేశారు. రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను కత్తిరించారు. రోడ్డుకు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలను, పొదలను తొలగించారు. కాలనీని ఆదర్శంగా నిలుపుతున్న కాలనీ అధ్యక్షుడు అశోక్, కమిటీ ప్రతినిధులకు ఎస్సారెస్పీ డీఈ గణేష్ కృతజ్ఞతలు తెలిపారు. హనుమాన్ ఆలయ కమిటీ అధ్యక్షుడు శివరాజ్ కుమార్. ఎమ్మార్వో విజయ్ కుమార్, ఆర్మూర్ డిప్యూటీ ఎమ్మార్వో విక్రమ్, మాజీ అధ్యక్షుడు రాజేందర్ గౌడ్, ఎస్సారెస్పీ డీఈ గణేష్, కమిటీ ప్రధాన కార్యదర్శి బి.కమలాకర్, కోశాధికారి సత్యనారాయణ గౌడ్, ఉపాధ్యక్షుడు సుంకే శ్రీనివాస్, కార్యదర్శి ఎల్.సాయన్న, ఎర్ర భూమయ్య, ఎల్ టి కుమార్, సదమస్తుల గణపతి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

నవీపేట్ సంతల వేలంకు వేళాయే..

- రాష్ట్రంలోనే మేకల సంతకు ప్రత్యేకత
- మేకల సంత వేలంతోనే పంచాయతీకి ఆదాయం
- ప్రత్యేక అధికారుల పాలనలో పారదర్శకంగా వేలం జరిగేనా?
- ప్రజా ప్రతినిధుల పాలనలో నిబంధనలు నీళ్లపాలు!
- నష్టపోతున్న వ్యాపారస్తులు, కొనుగోలుదారులు..
- ఆదాయం ఉన్న సౌకర్యాలు సున్నా!
- ప్రత్యేక అధికారులు ప్రత్యేకత చూపెట్టేనా?



నవతెలంగాణ-నవీపేట్

తెలంగాణ రాష్ట్రంలోనే నవీపేట్ మేకల సంతకు ప్రత్యేకత ఉంది. మేకల సంతకు ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్, సంగారెడ్డి, హైదరాబాద్, కరీంనగర్ జిల్లాలతోపాటు మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాల నుండి సైతం క్రయవిక్రయదారులు వేల సంఖ్యలో హాజరవుతారు. ప్రతి శనివారం కోట్ల రూపాయల్లో లావాదేవీల నిర్వహణతో తెలంగాణలోనే అతిపెద్ద మేకల సంతగా పేరుగాంచింది. అటువంటి మేకల సంతకు మంగళవారం వేలంపాట నిర్వహిస్తున్నా ప్రచారం చేయకపోవడంతో ఈసారైనా ప్రత్యేక అధికారుల పాలనలో పారదర్శకంగా నిర్వహించి గ్రామపంచాయతీ ఆదాయాన్ని ఘననీయంగా పెంచుతారా.. లేదా సిండికేటుగాళ్లకు సరెండర్ అవుతారా అని సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

నిబంధనలు నీళ్లపాలు

ప్రజా సేవకు అంకితం అవుతామని గొప్పలు చెప్పుకుని ప్రజల ఓట్లు దండుకొనే ప్రజాప్రతినిధులు నవీపేట్ గ్రామపంచాయతీకి ఆదాయం సమకూర్చడంతోపాటు క్రయవిక్రయదారులకు సంత వేలం పాట నిబంధనలు అమలు చేయాల్సి ఉండగా నీళ్ల పాలు చేసి కేవలం కాంట్రాక్టర్లకు మాత్రమే ఆదాయం సమకూరేలా అడ్జస్ట్మెంట్ అవుతున్నారు. మేకల సంత వేలంపాటకు లక్ష రూపాయలు, వారసంత వేలంపాటకు లక్ష రూపాయలు, సులబ్ కాంప్లెక్స్ కోసం రూ.50వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని కార్యదర్శి రవిందర్ నాయక్ కోరారు. గత సంవత్సరం మేకల సంతకు సిండికేట్ కాకుండా కొంత మంది యువకులు పంచాయతీ పాలకవర్గాన్ని ప్రశ్నించి అధికారులపై సైతం ఒత్తిడి తీసుకువచ్చి వేలం పాటను 55 లక్షలకు పలకడంతో గ్రామపంచాయతీ ఆదాయం ఘననీయంగా పెరిగింది. కానీ వేలంపాట నిబంధనైన మేక, వాహనాలకు, కూరగాయల వ్యాపారులకు సంబంధించిన రేట్ల పట్టికను సంతలో అమర్చకపోవడంతో కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరించి వ్యాపారస్తులపై బలవంతపు వసూళ్లకు పాల్పడి లక్షల రూపాయలు అర్జిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కాబట్టి ఈసారైనా ప్రత్యేక అధికారుల పాలనలో వేలం పాట నిబంధనలను కచ్చితంగా పాటించాలని స్థానిక యువకులు, వ్యాపారులు కోరుతున్నారు.

లక్షలు ఆదాయం ఉన్న సౌకర్యాలు సున్న!

గత సంవత్సరం మేకల సంతకు 55 లక్షలు, వారాం తపు, రోజు వారి సంతకు 14 లక్షలు ఆదాయం వచ్చిన సంత ప్రాంతంలో వ్యాపారస్తులకు వినియోగదారులకు ఎటువంటి సౌకర్యాలు కల్పించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాగునీరు, నీడ సౌకర్యాలతో పాటు వర్షపు నీరు నిల్వ ఉండకుండా ఉంచాల్సిన గత పంచాయతీ పాలక వర్గాలు కేవలం ఆదాయపు వనరులుగా మాత్రమే సంతలను చూస్తుండడంతో ప్రజలు, వ్యాపారస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈసారైనా ప్రత్యేక అధికారులు ప్రత్యేక చొరచూపి సౌకర్యాలను కల్పించాలని కోరుతున్నారు.

రాజకీయ లబ్ధి కోసమే బంజారాలపై ఎంపీ కపట ప్రేమ

- బిజేపి బంజారాలకు చేసింది శూన్యం
- కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు యాదగిరి ధ్వజం


మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

రాజకీయ లబ్ధి కోసమే ఎంపీ అరవింద్ బంజారాలపై కపట ప్రేమ చూపిస్తున్నారని, బిజెపి బంజారాలకు చేసింది ఏమీ లేదని కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు యాదగిరి ధ్వజమెత్తారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో నిజామాబాద్ ఎంపీ కులాలు, మతాల మధ్య చిచ్చు పెట్టి స్వార్థ రాజకీయాలకు తెరలేపుతున్నారని విమర్శించారు. ఆదివారం కాంగ్రెస్ భవన్‌లో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ. కాంగ్రెస్ ఎన్నికల డిక్లరేషన్ లో చెప్పిన విధంగా ఆదివాసీ కార్పొరేషన్, గిరిజన కార్పొరేషన్, ఎరుకల కార్పొరేషన్ తీసుకువస్తుందని, అదేవిధంగా అసైన్డ్ భూములకు, పోడు భూములకు పట్టాలు ఇస్తామని తెలిపారు. ఆదివాసీ, గిరిజన సోదరులు వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పక్షాన నిలుస్తారనే భయంతో ఎంపీ అరవింద్ రామ్‌రావు మహారాజ్ విగ్రహాలు పంపిణీ చేశారని అన్నారు. నిజంగా అరవింద్ కు గిరిజనుల పట్ల ప్రేమ ఉంటే కేంద్రంతో మాట్లాడి ప్రతి తండాలో రామ్ రావు మహారాజ్ గుడి కట్టించాలని డిమాండ్ చేశారు. 2019 ఎన్నికల్లో బంజారాల గురువు కి మాట ఇచ్చిన విధంగా గిరిజనుల అభివృద్ధికి కానీ, గిరిజనుల పక్షాన గాని ఏనాడూ నిలపడ లేదని తెలిపారు. ఎంపీ అరవింద్ ఐదేళ్ల కాలంటో తండాల్లో ఏమి అభివృద్ధి చేశారని ప్రశ్నించారు. శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సంతు సేవాలాల్ రామ్ రాజ్ మహారాజ్ సమావేశంలో తన రాజకీయ లబ్ధి కోసమే ఎంపీ అరవింద్ ఏర్పాటు చేశారు తప్ప బంజారాల పట్ల ఎంపీకి ఎలాంటి గౌరవం లేదని విమర్శించారు. గిరిజనుల పట్ల చిత్తశుద్ధి ఉంటే ఎస్టీలకు ఉన్న రిజర్వేషన్స్ 10శాతం నుండి 12కు పెంచాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలలో ఖాళీగా ఉన్న ఎస్సి, ఎస్టి బ్యాక్ లాక్ పోస్టులు భర్తీ చేయడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తెలిపారు. ఎన్ఐటి, ఐఐటీ లాంటి ప్రతిష్టత్మక విద్య సంస్థలను నిజామాబాదు పార్లమెంట్ నియోజకవర్గం లో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజనులను హైకోర్టు,సుప్రీం కోర్టులలో న్యాయమూర్తులుగా నియమించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు ముప్ప గంగారెడ్డి, తరచంద్ నాయక్, ప్రకాష్ నాయక్, రవి నాయక్, సుర్యనాయక్, వెంకట్రంనాయక్, శ్రీను, నరేందర్, మోతీలాల్ గిరిజన సోదరులు పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి అందజేత


క్రీడా సామగ్రిని అందజేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-ముప్కాల్

మండలంలోని వేంపల్లి గ్రామంలోని పలు యువజన సంఘాలకు ఆదివారం జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు ఎస్.రాజ్ కుమార్ క్రీడ పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల వల్ల దేహ ధారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని అన్నారు. కార్యక్రమంలో యంగ్ పవర్ యూత్ అధ్యక్షులు తెలు శ్రీనివాస్, ఆదర్శ యూత్ అధ్యక్షులు ద్యాగ మహేందర్, సభ్యులు అనిల్, శ్రవణ్, సందీప్, సురేష్, కళ్యాణ్ తదితర క్రీడాకారులు పాల్గొన్నారు..

వేసవి కాలంలో మొక్కల సంరక్షణపై అవగాహన


శ్రమ దానం చేస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని దుర్గానగర్ తండా గ్రామంలో తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ వన్ వాలంటీర్స్‌కు వేసవి కాలంలో మొక్కల సంరక్షణపై తెలంగాణ యునివర్సిటీ ఎస్ఎస్ ఎస్ కో ఆర్డినేటర్ డా. రవీందర్ రెడ్డి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎన్ ఎస్ ఎస్ అధ్వర్యంలో ఆరవ రోజు ఆదివారం శ్రమదానం చేసి మొక్కల దగ్గర ఉన్న చెత్తాచెదారాన్ని తీసివేసి, పాదులు కట్టి మొక్కలకు నీటిని అందించారు. నీటి కాలువలో పూడికలు తీసి పిచ్చి మొక్కల్ని తొలగించారు. గ్రామ ప్రజలతో మాట్లాడి ఎన్ఎస్ఎస్ ముఖ్య ఉద్దేశాన్ని వివరించారు. కార్యక్రమంలో ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం అధికారి డా. సరిత, డి.సుమలత, శ్వేత పాల్గొన్నారు.

12న గూడ్స్ షెడ్‌ను జాతికి అంకితం చేయనున్న ప్రధాని



నవతెలంగాణ-డిచ్‌పల్లి

నిజామాబాద్ జిల్లా డిచ్ పల్లి మండల కేంద్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన గూడ్స్ షెడ్ను మంగళవారం ఈనెల 12 న ఉదయం 8 గంటలకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ వర్చువల్ వేదికగా ప్రారంభించి జాతికి అంకితం చేయనున్నట్లు ప్రోగ్రాం ఇంచార్జీ రవీందర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గూడ్స్ షెడ్డు, ప్లాట్‌ఫాం, హమాలీ గదిని ప్రధాని ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి అందరు హాజరుకావాలని రవీందర్ కోరారు.

గృహజ్యోతి ప్రారంభం

నవతెలంగాణ-సిరికొండ

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఆరు గ్యారెంటీల్లో భాగంగా ఆదివారం ముషీర్ నగర్‌లో గృహజ్యోతి 200 యూనిట్ కరెంట్ ఉచిత పథకం, 500 రుపాయలకే వంట గ్యాస్ సిలిండర్ పథకాన్ని ప్రారంభించారని ఎస్టీ సెల్ జిల్లా నాయకులు మలావత్ భూపతి నయాక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ సీనియర్ నాయకులు వెల్మ భాస్కర్ రెడ్డి సహకారాలతో ఉచిత కరెంట్ పథకానికి ఆదివారం ప్రారంభించారని అన్నారు. కార్యక్రమంలో గ్రామ లైన్ మెయిన్ భిక్షపతి, గ్రామ శాఖ కన్వీనర్ మలావత్ గజన్ లాల్, యూత్ కన్వీనర్ నరేష్, బనావత్ రాజేందర్, మోజీరం, తార నాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


విద్యుత్ బిల్లును అందజేస్తున్న పలువురు

సంక్షేమ హాస్టళ్లలో ఏసీబీ దాడులు నిర్వహించాలి : ఏఐఎస్‌బి

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఉన్న (ఎస్సీ, ఎస్టీ,బీసీ, కేజీబీవీ గురుకులాల్లో) ఉన్న అన్ని సంక్షేమ వసతి గృహాల్లో (ఏసీబీ) జిల్లా అధికారులు వెంటనే దాడులు నిర్వహించాలని (ఏ.ఐ.ఎస్.బీ) ఆల్ ఇండియా స్టూడెంట్స్ బ్లాక్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు బైరాపూర్ రవీందర్ గౌడ్ డిమాండ్ చేశారు. కొంత మంది హాస్టల్ అధికారులు లక్షలాది రూపాయలు మెక్కేస్తున్నారని ఆయన మండిపడ్డారు. సంక్షేమ హాస్టళ్లపై (ఏ.సీ.బీ) అధికారులు దాడులు నిర్వహించి అవినీతి అధికారులపై ఉక్కుపాదం మోపాలని ఆయన డిమాండ్ చేశారు. గతంలో ఉమ్మడి జిల్లాలో సంక్షేమ హాస్టళ్లపై (ఏసీబీ) అధికారులు దాడులు చేసినపుడు ఎన్నో అవినీతి అక్రమాలు బయట పడ్డాయని ఆయన తెలిపారు. జిల్లా ఉన్నత అధికారులు సంబంధిత వార్డెన్లు, ఎస్ఓలు, గురుకుల ప్రిన్సిపాళ్లు, వార్డెన్‌ల నుంచి నెలనెలా మామూళ్లు తీసుకుంటూ పేద విద్యార్థుల పొట్ట కొడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే గతంలో నిర్వహించిన (ఏ.సీ.బీ) దాడుల మాదిరాగానే ప్రస్తుతం కూడా దాడులు నిర్వహించాలని ఆయన అధికారులనూ విజ్ఞప్తి చేశారు.అన్ని హాస్టలళ్లో ఏసీబీ దాడులు నిర్వహించి అక్రమార్కుల అక్రమాలు లెక్కతీయాలని ఆయన కోరారు.

మహిళా సాధికారతకు నిదర్శనం సావిత్రిబాయి పూలే


సిరికొండ: సావిత్రిబాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



నిజామాబాద్ జిల్లా కేంద్రంలో...


డిచ్‌పల్లిలో...

నవతెలంగాణ-సిరికొండ

మహిళా సాధికారతకు చక్కని నిదర్శనం సావిత్రిబాయి పూలె అని, సమాజంలో ఉన్న లింగ వివక్షతని రూపుమాపడానికి, మహిళల విద్యా వ్యాప్తి కోసం సావిత్రిబాయి పూలే చేసిన కృషి, ఆమె సహనం సంకల్పం, ఆదర్శం కావాలని సత్యశోధక్ ఎడ్యుకేషనల్ చైర్మన్ ఆర్.నర్సయ్య అన్నారు. మహిళల విద్యాభివృద్ధి, హక్కులు, సమానత్వం కోసం అహర్నిశలు శ్రమించిన తొలి మహిళా ఉద్యమ కారిణి, భారతదేశ మొదటి ఉపాధ్యాయిని, సంఘ సంస్కర్త, క్రాంతి జ్యోతి సావిత్రి బాయి అని అన్నారు. పూలే 127వ వర్ధంతి ని సత్యశోధక్ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. మొదటగా ఆర్.నర్సయ్య సావిత్రి బాయి పూలే చిత్ర పటానికి పూలమాలవేసి నివాలులు అర్పించారు ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ అనాదిగా వస్తున్న మూఢ నమ్మకాలను, ఆచారాలను ప్రశ్నించి ప్రజల్లో చైతన్యం కొరకు తన భర్త జ్యోతిరావు పూలే అందించిన తోడ్పాటుతో ఉద్యమించిన తొలి మహిళా ఉద్యమ కారిణి సావిత్రి బాయి పూలే జీవితం శ్లాఘనీయమన్నారు. సమాజంలో అగ్రవర్ణ జాతులు అవహేళన, అవమానాలకు ఏ మాత్రం చలించకుండా అనుకున్న లక్ష్యం కోసం అహర్నిశలు శ్రమించి తన వ్యక్తిగత జీవితంను సైతం త్యాగం చేసిన అమ్మ సావిత్రి బాయి పూలే చరిత్రలో చిరస్మరనీయులు అన్నారు. అనూహ్య పరిణామాలతో ఉన్న ఈ సమాజంలో మహిళలు చైతన్యవంతంగా ఉండి కుటుంబ, సమాజ స్థితి గతుల నిర్మాణంలో ఉన్నతంగా ఎదగాలని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు గంగారెడ్డి, శంకర్, రాజు మరియు విద్యార్థులు పాల్గొన్నారు

సంఘసంస్కర్త, సామాజిక కార్యకర్త సావిత్రిబాయి పూలే

నిజామాబాద్ సిటీ : సంఘసంస్కర్త, సామాజిక కార్యకర్త సావిత్రిబాయి పూలే ఈ దేశానికే ఆదర్శం అని ఏఐఎస్ఎఫ్ నాయకులు అన్నారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే 127 వ వర్ధంతి సందర్భంగా నిజామాబాద్ నగరంలోని సిపిఐ పార్టీ జిల్లా కార్యాలయంలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి సుధాకర్ మాట్లాడుతూ భారతదేశంలోని మొట్టమొదటి ఉపాధ్యాయులు సంఘసంస్కర్త, సామాజిక కార్యకర్తగా పనిచేసిన ఘనత ఆమెకు దక్కుతుందని అన్నారు. ఆ కాలంలో అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాటం చేసి బడుగు, బలహీన వర్గాల కోసం ఆమె పని చేసిన కృషి ఎనలేనిదన్నారు. మహిళలకు చదువుకు దూరం చేసే ఆలోచనలకు వ్యతిరేకంగా ఆమె పోరాటం చేశారని, మూడనమ్మకాలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్య పరుస్తూ అంటరానితనానికి వ్యతిరేకంగా, సతి సహగమనానికి వ్యతిరేకంగా పనిచేసి ప్రజలను చైతన్య పరుస్తూ ఆదర్శప్రాయంగా నిలిచిందని తెలిపారు. ఇప్పుడు ఉన్న సమాజంలో విద్యార్థులు, యువకులు, మేధావులు ఆమె జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని పనిచేస్తేనే నివాళులర్పించినట్టుగా అవుతుందని అన్నారు. కార్యక్రమంలో ఎఐటియుసి నిజామాబాద్ జిల్లా కార్యదర్శి ఓమయ్య, ఏఐఎస్ఎఫ్ నిజామాబాద్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అంజలి రఘురాం ఏఐఎస్ఎఫ్ నగర్ నాయకులు పవన్ కళ్యాణ్, సాయి, నవీన్, నితిన్, రమేష్, తేజు పాల్గొన్నారు.

నిజామాబాద్ సిటీ : అసమానతలులేని సమాజం కోసం సావిత్రిబాయి పూలే స్ఫూర్తితో పోరాటం చేయాలని పిడిఎస్‌యూ నగర ఉపాధ్యక్షురాలు దేవిక విద్యార్థులకు పిలుపునిచ్చారు. సావిత్రిబాయి పూలే 127వ వర్ధంతి సందర్భంగా నిజామాబాద్ జిల్లా కేంద్రంలో పిడిఎస్‌యూ నిజామాబాద్ నగర కమిటి ఆధ్వర్యంలో సావిత్రి బాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా దేవిక మాట్లాడుతూ సావిత్రి బాయి పూలే దేశంలో మొట్టమొదటిసారిగా మహిళలకు అట్టడుగు వర్గాల వారికి చదువు నేర్పించిందని, పిత్ర సామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా, వితంతు వివాహాలకు వ్యతిరేకంగా, కుల నిర్మూలనకోసం పోరాటాలు నిర్వహించిందని తెలిపారు. సావిత్రిబాయి పూలే స్ఫూర్తితో విద్యా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా, అసమానతలు లేని సమాజం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నగర నాయకులు నిఖిల్, అజయ్, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి : తెలంగాణ యూనివర్సిటీ సమస్యలపై సావిత్రిబాయి పూలే స్ఫూర్తితో పోరాటం చేయాలని తెలంగాణ యూనివర్సిటీ పిడిఎస్‌యూ నాయకులు అక్షయ్, రవీందర్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. సావిత్రిబాయి పూలే 127వ వర్ధంతి సందర్భంగా తెలంగాణ యూనివర్సిటిలో ఆదివారం సావిత్రి బాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సావిత్రి బాయి పూలే దేశంలో మొట్ట మొదటిసారిగా మహిళలకు, అట్టడుగు వర్గాల వారికి చదువు నేర్పించిందని అన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ నాయకులు హాస్మండ్లు, నవ్య, బిందు, అశ్విన్, సాయి పవన్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
3
కామారెడ్డి
సోమవారం | మార్చి 11, 2024 | www.navatelangana.com

కాంగ్రెస్‌లో పలువురు చేరిక

నవతెలంగాణ-కామారెడ్డి

22 వార్డ్ కౌన్సిలర్ జహీరా బేగం బిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి వార్డ్ అభివృద్ధి దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్ పార్టీలో ఆదివారం చేరారు. కామారెడ్డి మున్సిపల్ వైస్ చైర్పర్సన్ గడ్డం ఇందుప్రియ చంద్రశేఖర్‌రెడ్డి నివాసంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఉర్దొండ రవి, యమిన్, తేజప్రసాద్, రవీందర్ గౌడ్, చాట్ల వంశీకృష్ణ, జమీల్, సయ్యద్ ఇమ్రాన్, జూలూరి సుధాకర్, జమీల్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్‌లో చేరిన వార్డు కౌన్సిలర్లు

అక్షరజ్ఞానాన్ని అందించిన సావిత్రి బాయిపూలే

- డాక్టర్ భట్టు విఠల్ ముదిరాజ్

నవతెలంగాణ-కామారెడ్డి

మహిళలకు అక్షరజ్ఞానాన్ని అందించిన అమ్మ సావిత్రి బాయి పూలే అని ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ భట్టు విఠల్ ముదిరాజ్ అన్నారు. ఆదివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ముదిరాజ్ సంఘం సమావేశంలో సావిత్రిబాయి పూలే వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద ప్రజల చైతన్యానికి విద్యనే సరైన మార్గమని చెప్పిన తన భర్త జ్యోతిరావు బాపూలే స్ఫూర్తి పొంది విద్యాబోధన చేసిందని అన్నారు. సావిత్రిబాయిని ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. సమావేశంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ భట్టు విఠల్

శ్రమను నమ్ముకుని..

- వ్యవసాయం చేస్తూ.. పాడిపశువులు పెంచుతున్న యువకుడు
- నెలకు రూ.లక్షన్నర ఆదాయం
- ఆదర్శంగా నిలుస్తున్న రాంపూర్ వాసి

నవతెలంగాణ-కోటగిరి

వ్యవసాయమంటే మక్కువ. పాడిపశువులంటే ప్రాణం. దాంతో ఇటు వ్యవసాయం చేస్తూ.. అటు పశువులను పెంచుతూ నెలకు రూ.లక్షన్నర ఆదాయం సంపాదిస్తున్నాడు ఓ యుకువడు. డిగ్రీ చదివినా ఉద్యోగం కోసం వెంపర్లాడకుండా.. శ్రమను నమ్ముకుని ఆదర్శంగా నిలసున్నాడు కోటగిరి మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన యువకుడు.

మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన పాలడుగు శరత్ బాబు, ఝాన్సీ దంపతుల కుమారుడు పాలడుగు రాకేష్ ఒకటి నుంచి 10వ తరగతి వరకు కోటగిరి మండల కేంద్రంలో ప్రైవేటు పాఠశాలలో



విద్యనభ్యసించాడు. నిజామాబాద్‌లో డిగ్రీలో బీకాం చదివాడు. వ్యవసాయం మీద మక్కువతో తనకున్న నాలుగు ఎకరాలలో పశుగ్రాసం పెంచాడు. ముగ్గురు కార్మికులతో నెలకు లక్షన్నర ఆదాయం సంపాదిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

తల్లిదండ్రులు, భార్య చేదోడు, వాదోడుగా నిలవడంతో శ్రమను నమ్ముకుని ముందుకు సాగుతున్నాడు. భూమిని, పాడిని నమ్ముకుంటే ఎంతటి కష్టాన్నయినా సునాయాసంగా అధిగమించవచ్చునన్న అక్షర సత్యంతో ముందుకు సాగుతున్నాడు. 28 ముర్రె గేదెలు, ఏడు హెచ్ఎఫ్ ఆవుల ఆలనా పాలన చూస్తూ జీవనం సాగిస్తూ రోజుకి సరాసరి 170 లీటర్ల పాల ద్వారా ఉత్పాదన పొందుతూ మండలంలో ఆదర్శంగా నిలుస్తున్నాడు. ఇవే కాకుండా కౌలుకు ఐదు ఎకరాలలో ఫామాయిల్ తోట, ఒక ఎకరంలో పుచ్చకాయ తోటతో పాటు, కోళ్ల పరిశ్రమ, నాటు కోళ్ల పెంపకం ద్వారా నెలకు రూ.30వేలు అదనంగా సంపాదిస్తున్నాడు. పశువుల సేంద్రియ ఎరువును వారి పొలాలలో వాడకం ద్వారా అధిక దిగుబడులకు శ్రీకారం చుడుతున్నాడు. డిగ్రీ పూర్తి చేసినప్పటికీ మహానగరంలో



ఉద్యోగం కోసం పాకులాడక.. చెల్లి పెళ్లి చేసి, గ్రామంలోనే పాడి పంటలతో ప్రశాంతమైన, ఆరోగ్యకరమైన జీవనం సాగిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నాడు రాకేష్.

ఇందిరా క్రాంతి పథకం ద్వారా ముద్ర లోన్ పొంది ట్రాక్టర్ సబ్సిడీ ద్వారా ముందుకు సాగుతూ ఆధునిక పద్ధతులను పాడి పరిశ్రమలో చేపడుతున్నాడు. ఉదయం లేచినది మొదలు రాత్రి పొద్దుబోయే వరకు వ్యవసాయ, పాడి పరిశ్రమంలో మునుగుతూ పశువుల ఆలనా పాలనతో పలువురికి ఆదర్శంగా నిలుస్తూ శభాష్ అనిపించుకుంటున్నాడు రాకేష్.

చెరువులో పడి యువకుడు మృతి

నవతెలంగాణ-ఎడపల్లి

చెరువులో పడి యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. మండల కేంద్రానికి చెందిన గుంజేరి రాహుల్(25) ఈ నెల 8న అర్ధరాత్రి ఇంట్లో నుంచి వెళ్లాడు. ఆరోజు నుంచి కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. కాగా ఆదివారం తెల్లవారుజామున రాహుల్ మృతదేహం ఎడపల్లి పులి చెరువులో లభించింది. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎడపల్లి ఎస్సై భూపల్లి విక్రమ్ ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించి తల్లి సాయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



మృతి చెందిన రాహుల్

తాగునీటి ట్యాంకులను పరిశీలించిన ఏఈ

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని వీరన్నగుట్ట గ్రామంలో తాగునీటి ట్యాంకుల నుంచి స్థానిక ప్రజలకు కోడి ఈకలు వచ్చి నీరు కలుషితమైనట్టు స్థానిక ప్రజలు ఆరోపించడంతో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గబ్బర్ సింగ్ శనివారం గ్రామాన్ని సందర్శించి ట్యాంకులను పరిశీలించారు. ప్రతి శుక్రవారం పారిశుధ్య సిబ్బంది వాటిని శుభ్రం చేయడంతో పాటు బ్లీచింగ్ పౌడర్ వేస్తూ ఉండడంతో నీరు స్వచ్ఛందంగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. తన వెంట గ్రామ కార్యదర్శి రాజు, కారోబార్ బాబా, ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నీటి ట్యాంకును పరిశీలిస్తున్న ఏఈ

బిజెపిలో పలువురు చేరిక

నవతెలంగాణ-మద్నూర్

మండల కేంద్ర మేజర్ గ్రామపంచాయతీ తాజా మాజీ ఉపసర్పంచ్ బోయిన్ వార్ విఠల్, డోంగ్లి మండలంలోని మోగా గ్రామ తాజా మాజీ సర్పంచ్ సూర్యకాంత్ పటేల్ వీరిద్దరూ జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ సమక్షంలో బిజెపిలో చేరారు.

దుప్పట్లు పంపిణీ

నవతెలంగాణ-కామారెడ్డి

ఉగ్రవాయి గ్రామానికి చెందిన తాడ్వాయి రవికుమార్ మృతి చెందిగా అతని స్నేహితులు స్నేహితుని జ్ఞాపకార్థంగా అనాథ పిల్లలకు 40 దుప్పట్లను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అతని స్నేహితులు మాట్లాడుతూ.. తమ మిత్రుడు రవికుమార్ మృతి చెందడంతో ఆయన జ్ఞాపకార్థం దుప్పట్లు పంపిణీ చేసినట్టు ఇవరించారు. కార్యక్రమంలో పెద్దొళ్ల మహిపాల్, వడ్ల రవి, సుండు భాస్కర్, హాస్టల్ ఇన్చార్జి శోభన్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి హరీష్‌రావు వ్యాఖ్యలను ఖండించిన డీటీఎఫ్

నవతెలంగాణ-కామారెడ్డి

ప్రస్తుతం ప్రభుత్వం ఉద్యోగులకు హామీనిచ్చిన విధంగా ఒకటో తేదీన వేతనాలు చెల్లించడాన్ని తట్టుకోలేక రైతులను ఉద్యోగ, ఉపాధ్యాయులపై మాజీ మంత్రి హరీష్‌రావు తన మాటలతో ఉసిగొల్పడాన్ని డిటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి బి.దేవుల తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు రైతులకు వ్యతిరేకం కాదనీ, రైతులకు రైతుబంధు చెల్లించాల్సిందే, అలాగని ఉద్యోగుల జీతాలకు రైతుబంధుకు లింకు పెట్టి మాట్లాడడం సరైంది కాదని పేర్కొన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం చౌకబారుగా మాట్లాడితే రైతులు గ్రహించలేరని అనుకోవడం తెలివితక్కువతనమే అవుతుందనీ ఆ ప్రకటనలో పేర్కొన్నారు. 10 సంవత్సరాలు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ ప్రభుత్వం కొన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలకు వత్తాసు పలికి వారి పైరవీలు, వ్యక్తిగత ప్రయోజనాలను చేర్చి తెలంగాణలోని లక్షలాది ఉద్యోగుల హక్కులను కాలరాసిన ఫలితమే బిఆర్ఎస్‌కు ఈ దుస్థితి అనే విషయం హరీష్‌రావు మర్చిపోవడం బాధాకరమైన విషయమని తెలిపారు.

నేడు నాలుగు వరుసల రోడ్డు, సెంట్రల్ లైటింగ్ పనులకు భూమిపూజ

నవతెలంగాణ-బిచ్కుంద

బిచ్కుంద మండల కేంద్రంలో నాలుగు వరుసుల రోడ్డు నిర్మాణం, సెంట్రల్ లైటింగ్ పనులకు జుక్కల్ శాసనసభ్యులు తోటలక్ష్మీకాంతరావు చేతుల మీదుగా మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా సమీపాన ఉదయం 10.30 నిమిషాలకు ప్రారంభించనున్నట్టు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ధర్పల్లి గంగాధర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు, పెద్దఎత్తున తరలిరావాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

ముదిరాజ్ మహాసభ 2024 క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

ముదిరాజ్ మహాసభ 2024 క్యాలెండర్‌ను నాగిరెడ్డిపేట్ మండల ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు గంపల వెంకన్న ఆధ్వర్యంలో క్యాలెండర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ముదిరాజ్ మండల ప్రధాన కార్యదర్శి సత్యబోయిన నారాయణ, కార్యవర్గ సభ్యులు నారాయణ, బి.నర్సింలు, సిహెచ్.బాలయ్య, సాయిలు, భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని భూంపల్లి గ్రామంలో సీసీ రోడ్డు పనులను ఆదివారం ప్రారంభించారు. పనుల కోసం ఎమ్మెల్యే మదన్ మోహన్‌ను అడగగానే రూ.10లక్షలు మంజూరు చేసినందుకు ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు, ఉపాధ్యక్షులు, కాంగ్రెస్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు బసవేశ్వర విగ్రహం ప్రారంభోత్సవం

నవతెలంగాణ-జుక్కల్

మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన బసవేశ్వర విగ్రహ ప్రారంభోత్సవాన్ని వీరశైవ లింగాయత్ సమాజ్ వారు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వీరశైవ లింగాయత్ సమాజ్ సంఘం మండల నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి స్వాములు హనేగాంకర్, కౌలాస్ మహంతయప్పా, జుక్కల్ బసవలింగాయప్పా, ఖత్గాం మల్లికార్జునప్పా, బిచ్కుంద మఠ్ సంస్థాన్ పీఠాధీపతి స్వామి సోమయప్పా, తములుర్ అప్ప, జహిరాబాద్ ఎంపి బీబి పాటిల్, జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావ్, మాజీ ఎమ్మెలేలు హన్మంత్ షిండే, సౌదాగార్ గంగారాం, కూమారి అరుణాతారా, మాజీ ఎంపి సురేష్ శెట్కార్ తదితరులు హాజరుకానున్నట్టు ప్రతినిధులు తెలిపారు.

గీత సహకార పరిశ్రామిక సంఘం అధ్యక్షులుగా రాజాగౌడ్



నియామకపత్రం అందజేత

నవతెలంగాణ-లింగంపేట్

గీత సహకార పరిశ్రమ సంఘం అధ్యక్షులుగా సంఘన్న రాజాగౌడ్‌ను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం రేణుక ఎల్లమ్మ ఆలయంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో లింగంపేట గీత సహకార సంఘం అధ్యక్షులుగా సంగాన్న రాజాగౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా డి.అంజాగౌడ్, కార్యదర్శిగా ఎస్.రామ్ చందర్‌గౌడ్, డైరెక్టర్లుగా నరసాగౌడ్, లక్ష్మీనారాయణ గౌడ్, నారా గౌడ్, వెంకట్‌గౌడ్, రాజేశ్వర్‌గౌడ్, నరేందర్ గౌడ్‌ను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గసభ్యులకు పూలదండ వేసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. వారిచేత ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో మనోహర్‌గౌడ్, భాస్కర్ గౌడ్, గౌడ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మున్నూరు కాపులకు పార్లమెంట్ సీటు కేటాయించాలి

- మాజీ మంత్రి హరీష్‌రావుకు వినతి



మాజీ మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న మున్నూరు కాపులు

నవతెలంగాణ-లింగంపేట్

తెలంగాణలో రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణాలో అధిక జనభా ఉన్న మున్నూరుకాపులకు పార్లమెంటు సీట్లు కేటాయించాలని కోరుతూ తెలంగాణ మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మాజీ మంత్రి హరీష్‌రావుకు వినతిపత్రాన్ని అందజేసినట్టు మున్నూరు కాపు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుండ బాలకిషన్ తెలిపారు. మున్నూరుకాపులను ఓటు బ్యాంకుగా కాకుండా రాజకీయాలలో ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. మున్నూరు కాపులను రాజకీయంగా, ఆర్థికంగా, విద్యాపరంగా ముందుకు నడవాలని అన్నారు. కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘ నాయకులు మేకల రాములు, ఆకుల సంగయ్య, పెద్దోల పోచ్చయ్య, పోకల మల్లయ్య నాయికోటి సత్యనారాయణ, ఆకుల సురేందర్, ఆవుల మనోహర్, పుట్నల మనోహర్, బండి రాములు,బండి ప్రవీణ్ కత్తూరి ధనరాజ్‌లు పాల్గొన్నారు.

జువ్వాడిలో గృహజ్యోతి పథకం ప్రారంభం

నవతెలంగాణ-గాంధారి

మండలంలోని జువ్వాడి గ్రామంలో గృహజ్యోతి 200 యూనిట్లు ఉచిత విద్యుత్ పథకానికి విద్యుత్ అధికారులు కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు గుర్రం సంతోష్, భూమేశ్, జువ్వాడి వినయ్‌కుమార్, వడ్ల స్వామి, చంద్రం, గోవర్ధన్, సాగర్, విజయ్, విద్యుత్తు సిబ్బంది పాల్గొన్నారు.

సురేష్ షెట్కార్‌కు సన్మానం

నవతెలంగాణ-జుక్కల్

కాంగ్రెస్ పార్టీ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థిగా సురేష్ శెట్కార్‌ను అధిష్టానం ప్రకటించడంతో మండలంలోని మహమ్మదాబాద్ గ్రామ మాజీ సర్పంచ్ లక్షెట్టి సాయిలు ఆదివారం సురేష్ శెట్కార్‌ను సన్మానించారు. సన్మాన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన లేని బస్సులు

- సమయానికి బస్సులు రాకపోవడంతో ఇబ్బందులు
- గంటల తరబడి పడిగాపులు

నవతెలంగాణ-మద్నూర్

మండల కేంద్రం నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు బస్సు సౌకర్యాలు లేకపోవడంతో గంటల తరబడి ప్రయాణికులు బస్టాండులో పడిగాపులు కాయవలసిన పరిస్థితి నెలకొంది. మండల కేంద్రం నుంచి నిజామాబాద్, కామారెడ్డి, బాన్సువాడ, పిట్లం, హైదరాబాద్ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు బస్సులు సమయానికి లేకపోవడంతో గంటల తరబడి వేచి ఉండాల్సిన దుస్థితి నెలకొంటుంది. దీంతో దూరప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు నానా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ప్రతిరోజు ఉదయం 5 గంటలకు బస్సు ఒకే ఒక్కటి ఉంటుంది. ఆ తర్వాత మూడు గంటల పాటు అంటే ఉదయం ఎనిమిది గంటల తర్వాతే బస్సు సౌకర్యం ఉంటుంది. ఆ తర్వాత 9 నుంచి 11 మధ్యలో దాదాపు రెండు గంటలు బస్సు సౌకర్యం లేదని ప్రజలు



బస్సు కోసం పడిగాపులు

అంటున్నారు. ఆదివారం ఉదయం ప్రయాణికులు 9 గంటలకు బస్టాండులో బస్సు కోసం ఎదురు చూడగా 11 గంటలకు వచ్చింది. అధికారులు స్పందించి సమయానికి బస్సులు వేసేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని అయ్యప్పల్లి తండాకు చెందిన మునావత్ స్వర్ణ అనే గిరిజన వైద్య విద్యార్థినికి హెల్పింగ్ బ్రిడ్జ్‌ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఆదివారం ఆర్థిక సాయం అందజేశారు. తండాకు చెందిన మునావత్ స్వర్ణ నల్గొండలో ఎంబిబిఎస్ నాలుగవ సంవత్సరం చదువుతుండటంతో తమ కుటుంబ ఆర్థిక పరిస్థితులు సరిగ్గా లేనందున చదువు ఆగిపోయే సమయంలో హెల్పింగ్ బ్రిడ్జ్‌ఫర్ ఎడ్యుకేషన్ సంస్థను సంప్రదించగా గతంలో రూ.20వేలు ఆర్థిక సహాయం అందించారు. అదేవిధంగా రెండోసారి జూకంటి అనిల్‌రెడ్డి, అపర్ణ, ప్రవీణ్, వనిత సహకారంతో రెండవ సారి రూ.21వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా హెల్పింగ్ బ్రిడ్జిఫర్ ఎడ్యుకేషన్ సంస్థ ప్రతినిధులు తోట సాయిలు, రజనీకాంత్ గౌడ్, కృష్ణాకర్ మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి కష్టపడి పై స్థాయికి వెళ్లి సమాజ సేవలో ముందుండాలని, ఏ విద్యార్థి అయినా డబ్బులు లేవని చదువు మధ్యలో ఆపివేయకుండా తమకు తోచినంత సహాయం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పర్వయ్య, గాండ్ల నర్సింలు, గుండ బాలకిషన్, సాయాగౌడ్, అరవింద్, పారు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను కలిసిన జువ్వాడి గ్రామస్తులు

నవతెలంగాణ-గాంధారి

మండలంలోని జువ్వాడి గ్రామ విడిసి సభ్యులు, కాంగ్రెస్ నాయకులు ఎల్లారెడ్డి శాసనసభ్యులు మదన్ మోహన్‌ను ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో విడిసి చైర్మన్ గుర్రం శ్యామ్, వైస్ చైర్మన్ బద్దం రాజిరెడ్డి, కార్యదర్శి పల్లె కిషన్‌రావు, చాకలి సాయిలు, క్యాషియర్ సాయిమాల్లు, గొల్ల రాములు, పెద్ద సాయిలు, బాపురావు, గొలుసు రమేష్, వినీత్, మ్యతరి మహేష్, కాంగ్రెస్ నాయకులు గుర్రం సంతోష్, గుర్రం భుమేశ్, జువ్వాడి వినయ్ కుమార్, గుర్రం మోహన్, ఉన్నారు.



స్త్రీలపై హింసకు వ్యతిరేకంగా ఉద్యమాలు నిర్మించాలి

- టీపీటీఎఫ్

నవతెలంగాణ-కామారెడ్డి

రోజురోజుకు దేశవ్యాప్తంగా మహిళలపై, బాలికలపై, శ్రామిక మహిళలపై హింస పెరుగుతున్న సందర్భంలో, హింసకు వ్యతిరేకంగా, వెల్లువలా మహిళా ఉద్యమాలు రావాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ మహిళా ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. ఆదివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం సందర్భంగా జరిగిన చర్చ గోష్టి నిర్వహించారు. కె.నలిని దేవి, సిహెచ్ లక్ష్మి, పి.విజయశ్రీ, శ్రీవాణి అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. సంఘటిత శక్తి ద్వారా మాత్రమే మహిళలపై హింసను అరికట్టగలుగుతామని, ప్రతిఘటన పోరాటాలు నిర్మించాలని, గృహహింసకు వ్యతిరేకంగా, అత్యాచారాలకు వ్యతిరేకంగా ఎక్కడికి అక్కడ మహిళలు, ప్రజాసంఘాల ద్వారా, శ్రామిక మహిళా సంఘాల ద్వారా ఉద్యమాలను నిర్మించి, ప్రతిఘటిస్తూ ఎదుర్కోవాలని వక్తలు తెలియజేశారు. ఇటీవల మణిపూర్‌లో జరిగిన మహిళలపై హింసను, దేశవ్యాప్తంగా మహిళా ఉద్యమాలపై, కార్యకర్తలపై స్త్రీలపై హింసకు వ్యతిరేకంగా సంఘటితంగా ఉద్యమాలు నిర్మించాలని అన్నారు. రోజురోజుకు దేశవ్యాప్తంగా మహిళలపై, బాలికలపై, శ్రామిక మహిళలపై హింస పెరుగుతున్న సందర్భంలో హింసకు వ్యతిరేకంగా, వెల్లువలా మహిళా ఉద్యమాలు



చర్చగోష్టిలో పాల్గొన్న టీపీటీఎఫ్ నాయకులు

రావాలని, సంఘటిత శక్తి ద్వారా మాత్రమే మహిళలపై హింసను అరికట్ట గలుగుతామని తెలిపారు. చర్చాగోష్టిలో కామారెడ్డి మహిళా వేదిక ప్రతినిధులు, ఇందిరా, రాజ్యలక్ష్మి, రాధ పాల్గొన్నారు. గతంలో చేపట్టిన మహిళా వేదిక ఉద్యమాలను, స్త్రీల సమస్యల పరిష్కారాలను ఈ సందర్భంగా తెలియజేశారు. ఇటీవల మణిపూర్‌లో జరిగిన మహిళలపై హింసను, దేశవ్యాప్తంగా మహిళా ఉద్యమాలపై, కార్యకర్తలపై జరుగుతున్న హింసను, దాడిని ఖండిస్తూ ఈ సమావేశం తీర్మానించింది. ఈ సదస్సులో టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు వై.సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి సిహెచ్ అనిల్ కుమార్, రాష్ట్ర కౌన్సిలర్ డాక్టర్ పి.నాగభూషణం, ఏపీటీఎఫ్ మాజీ అధ్యక్షులు కే వేణుగోపాల్, ఫెడరేషన్ సీనియర్ నాయకులు టి.హనుమాన్లు తదితరులు పాల్గొన్నారు.

గృహజ్యోతి జీరో బిల్లులు అందజేత


జీరో బిల్లును తీసుకుంటున్న లబ్దిదారులు

నవతెలంగాణ-బాల్కొండ

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న హామీలలో ఒకటైన గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల లోపు అర్హులైన విద్యుత్ వినియోగదారులకు ఆదివారం బాల్కొండ మండల పరిధిలోని బాల్కొండ, నాగపూర్, వన్నెల్ బి గ్రామాల్లో జీరో బిల్లులు అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ బాల్కొండ మండల అధ్యక్షుడు వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం మాట నిలబెట్టుకుందని అన్నారు.

అటెండర్ కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత



నవతెలంగాణ-(వేల్పూర్) ఆర్మూర్

మండలంలోని జాన్కంపేట్ ప్రైమరీ పాఠశాలలో అటెండర్‌గా విధులు నిర్వహించి అనారోగ్యంతో మరణించిన బాలయ్య కుటుంబానికి ఆదివారం స్థానిక హెల్పింగ్ హాండ్స్ స్వచ్ఛంద సంస్థ తరపున పదివేల నగదును అందజేశారు. గ్రామంలోని ప్రైమరీ పాఠశాలలో 40 సంవత్సరాలకు పైగా పనిచేసే పేదరికంలో ఉన్న ఆయన కుటుంబానికి తన వంతు తోడ్పాటును అందించాలని ఆర్థిక సహాయం చేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు జేమ్స్ గంగారెడ్డి, ఉపాధ్య క్షులు సౌడ అరుణ్, సభ్యులు గంగారెడ్డి, తలారి, నరేష్, ప్రేమ్ కుమార్, తాళ్ల మహిపాల్ పాల్గొన్నారు.

14న 'కిసాన్ మహా పంచాయత్' జయప్రదం చేయండి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ/ఆర్మూర్

ఈనెల 14 న జరిగే "కిసాన్ మహా పంచాయత్" కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని "సంయుక్త కిసాన్ మోర్చా" జిల్లా కమిటీ పిలుపునిచింది. ఆదివారం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం కార్యాలయం నిజామాబాద్‌లో సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్కెఎం) జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పెద్ది వెంకట్రాములు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎస్కేఎం రాష్ట్ర కన్వీనర్ వి.ప్రభాకర్ మాట్లాడుతూ... రెండు సంవత్సరాల క్రితం రైతు వ్యతిరేక మూడు నెలల చట్టాలకు వ్యతిరేకంగా రైతాంగం ఢిల్లీలో పోరాడినప్పుడు 750 మంది ప్రాణ త్యాగాల ఫలితంగా కేంద్ర ప్రభుత్వం తలవంచి వారు తెచ్చిన నల్ల చట్టాలను రద్దు చేస్తూ., కనీస మద్దతు ధర చట్టం అమలు చేస్తామని, రైతు సంక్షేమం కోసం పనిచేస్తామని తెలిపారు. ఏడు అంశాలపై రాతపూర్వక హామీనిచ్చి తుంగలో తొక్కి రైతాంగాన్ని మోసం చేసింది కేంద్ర ప్రభుత్వం అని అన్నారు. ఆహామీల అమలుకు ఫిబ్రవరి 13న ప్రారంభించిన రైతన్న పోరాటం మళ్ళీ ఊపందుకున్నదని అన్నారు. ఎన్నికల ముందు జరుగుతున్న ఈ పోరాటం వల్ల నష్టం కలుగుతుందని, బిజెపి ప్రభుత్వం నిర్దాక్షిణ్యంగా అన్నిదారులను మూసివేసి, వాటర్ క్యానన్లు ఉపయోగించి, రబ్బర్, బుల్లెట్లు, టియర్ గ్యాస్‌లను ప్రయోగిస్తూ బెదిరించిందన్నారు. అయినా వెనక్కు తగ్గక పోవడంతో కాల్పులకు సైతం తెగబడిందని, అందులో ఒక రైతు అమరత్వం పొందారని తెలిపారు. ఈ పోరాటంలో మరొక నలుగురు వ్యవసాయ రంగం దివాలాస్థితిలో ఉన్నకారణాలతో గుండెపోటుతో వీర మరణం పొందారని, అయినా ఈ ప్రభుత్వం నిరంకుశ దోరణితో ఉద్యమాన్ని నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. రైతులకు అండగా నిలవాలని సంయుక్త కిసాన్ మోర్చా దేశవ్యాప్తంగా ఈనెల 14న మహా పంచాయతీ నిర్వహిస్తుందని తెలిపారు. ధర్నా చౌక్‌లో ఈకార్యక్రమం ఉంటుందని అన్నారు. రైతులు, వ్యవసాయ కూలీలు అత్యధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఎస్కేఎం జిల్లా కమిటీ సభ్యులు పల్లపు వెంకటేష్, పిట్ల రామకృష్ణ, బి.దేవరాం, వేల్పూర్ భూమయ్య, గంగాధర్, సురేష్, కిషోర్, డి.రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్: కేంద్ర ప్రభుత్వం గతంలో రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు పరచాలని, రైతాంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మార్చి 14న ఢిల్లీలో జరిగే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఐఎఫ్‌టియూ నాయకులు కోరారు.

అఖిల భారత రైతు కూలీ సంఘం డివిజన్ కమిటీ, ఐఎఫ్టియు ఆధ్వర్యంలో ఆదివారం విలేకరుల సమావేశాన్ని పట్టణంలో ఐఎఫ్టియు ఆఫీసులో నిర్వహించారు. ఈ సమావేశంలో ఐఎఫ్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి దాసు మాట్లాడుతూ.. రైతాంగ పోరాట ఫలితంగా మోడీ సర్కార్ రైతాంగ సమస్యలను ఆరు నెలల్లో పరిష్కరిస్తానని చెప్పి లిఖితపూర్వకంగా హామీఇచ్చి రెండు సంవత్సరాలు గడిచిందన్నారు. సంయుక్త కిసాన్ మోర్చా పిలుపులో భాగంగా మార్చి 14న జిల్లా కేంద్రంలో జరిగే సభను జయప్రదం చేయాలని దాసు కోరారు. సమావేశంలో జిల్లా ఉపాధక్షులు ఖాజా మోహినూద్దీన్ మాట్లాడుతూ.. పంటకు గిట్టుబాటు, కనీస మద్దతు ధర ఇవ్వాలని, వ్యవసాయ వ్యతిరేక మూడు నల్ల చట్టాలను వాపస్ తీసుకోవాలని శాంతియుతంగా పాదయాత్ర చేస్తున్న రైతులపై గతనెల 21న అమానుషంగా కాల్పులు జరుపగా శుభకరణ్సింగ్ అనే రైతు మరణించారని తెలిపారు. సమావేశంలో ఐకేఎంఎస్ డివిజన్ అధ్యక్షులు బాబురావు,నాయకులు దేవన్న, ధర్మపురి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రభాకర్

పెండింగ్ బిల్లులు చెల్లించాలి


మాట్లాడుతున్న సిపిఐ నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్‌లో ఉన్న 10 కోట్ల రూపాయల బిల్లులను వెంటనే చెల్లించాలని కోరారు. ఆదివారం సిపిఐ జిల్లా కార్యాలయంలో మధ్యాహ్న భోజన కార్మికుల సమావేశం బైరి సాయమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ మాట్లాడుతూ నిజామాబాద్ జిల్లాకు గత ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్నటువంటి బిల్లులు ప్రస్తుతం రావాల్సిన సుమారు 10 కోట్ల రూపాయలు ఉన్నాయనాన్నరు. గత అక్టోబర్ నుంచి ఈ మార్చ్ వరకు కోడిగుడ్లు బిల్లు, 9,10వ తరగతి విద్యార్థులకు చెందిన బిల్లులతోపాటు మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలు 2000 రూపాయలు రావాల్సి ఉందన్నారు. ఒకటి నుండి 8వ తరగతి వరకు విద్యార్థుల బిల్లులు ఇవన్నీ కలిపి సుమారు 10 కోట్ల రూపాయలు బకాయి ఉన్నాయని తెలిపారు. బిల్లులను వెంటనే మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.ఓమయ్య మాట్లాడారు. సమావేశంలో మధ్యాహ్న భోజన సంఘం నాయకులు పోసాని, శకుంతల, నరేష్, పద్మ, సుహాసిని, వివిధ మండలాల బాధ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సమాచారం లేకుండా ఎలా శంకుస్థాపన చేస్తారు?

- ఆలూరులో ప్రోటోకాల్ వివాదం


మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్

నియోజకవర్గంలోని ఆలూరు మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడానికి ప్రజలు తిరస్కరించారు. గ్రామంలో భూమి పూజ, శంకుస్థాపన చేస్తామంటే సహించేదిలేదని బీజేపీ మండల అధ్యక్షులు కొత్తూరు గంగాధర్, గిరీష్ ఆదివారం అన్నారు. ఎలాంటి సమాచారం లేకుండా అభివృద్ధి పనులకు ఎలా శంకుస్థాపన చేశారని ప్రశ్నించారు. ప్రోటోకాల్ ప్రకారం చేస్తే తాము సహకరిస్తామని, లేని పక్షంలో ఒప్పుకోమని హెచ్చరించారు. కార్యక్రమంలో హరీష్, అరుణ్ టౌడు, మహేష్, నడిసరం మల్లయ్య ప్రణీతగౌడ్, ప్రళయతేజ భారత్, మహేష్ ,సురేష్ యాదవ్, రూపీసింగ్, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 13 నుండి పలు శిక్షణలు ప్రారంభం కానున్నాయని సంస్థ డైరెక్టర్ సుంకం శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మగ్గం వర్క్, ఉమెన్స్ టైలరింగ్ శిక్షణ ప్రారంభించడం జరుగుతుందని, ఆసక్తి గల 19 నుండి 45 సంవత్సరాల వయస్సు కలిగి నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల గ్రామీణ ప్రాంత యువతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిక్షణా సమయంలో భోజనం, హాస్టల్, శిక్షణా పూర్తిగా ఉచితంగా అందజేస్తమని తెలిపారు. శిక్షణా అనంతరం ధృవీకరణ పత్రం, టూల్ కిట్ కూడా అందిస్తామని పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఘన్పూర్ శివారులోని టిటిడిసి ట్రైజం క్యాంపస్‌లో సంప్రదించాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 08461-295428 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

సమసమాజ నిర్మాణ స్వాప్నికుడు రాజన్న


మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్

సమసమాజనిర్మాణస్వాప్నికుడురాజన్న డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ నాయకులు అన్నారు. పట్టణంలోని కామ్రేడ్ కుమార్ నారాయణ భవన్‌లో ఆదివారం డిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రొడ్డ రాజన్న. సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా డిటిఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు ఎం. రఘు శంకర్ రెడ్డి మాట్లాడుతూ సమ సమాజ నిర్మాణంకోసం నిరంతరం శ్రమించిన వ్యక్తిగా, అంతరాలు లేని సమాజం రూపొందాలని కలలుగన్న వ్యక్తి రాజన్న అని అన్నారు. విద్యారంగ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో చేపట్టిన ఉద్యమాలలో రాజన్న క్రియాశీల పాత్ర పోషించారన్నారు. డిటిఎఫ్ రాష్ట్ర నాయకులు నారాయణరెడ్డి, పి. శంతన్, వి. రాజారెడ్డి మాట్లాడుతూ.. కామన్ స్కూల్ విధానం ఈ దేశంలో అవసరమని అందుకు నిబద్ధతతో ఉద్యమించాలని ఎప్పుడూ అంటుండే వాడని అన్నారు. ఏ ఐ పి కే ఎస్ రాష్ట్ర నాయకులు వి. ప్రభాకర్, దేవరం మాట్లాడుతూ విద్యార్థి ఉద్యమాలలో రాజన్న పిడిఎస్యు ఆధ్వర్యంలో అనేక పోరాటాలు నిర్మించిన చరిత్ర కలిగిన వ్యక్తి అని కొనియాడారు. తెలంగాణ యూనివర్సిటీ ప్రొఫెసర్ పున్నయ్య మాట్లాడుతూ..ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కారం కావాలంటే సామాజిక సమస్యలు పరిష్కారం కావాలని నమ్మిన వ్యక్తి రాజన్న అని అన్నారు. సంతాప సభకు జిల్లా అధ్యక్షులు బాలయ్య అధ్యక్షత వహించగా ఉపాధ్యాయ సంఘాల నాయకులు వై. విజయకుమార్ ఎల్. శ్రీధర్, వెంకటరమణ, సాయన్న, విజయరామరాజు, ఓ మాజీ, పెంటన్న, దాసు, రాందాస్, దేవుల, రాజేంద్ర గౌడ్, జంగమ అశోక్, అడ్వకేట్ సిద్ధిరాములు, మండల విద్యాశాఖ అధికారులు, రాజగంగారాం, ఆంధ్రయ్యా, రాజన్న మిత్రులు, కుటుంబ సభ్యులు, మనోహరాబాద్ గ్రామస్తులు పాల్గొని సంతాపం తెలియజేశారు.

నమస్తే తెలంగాణ దినపత్రికలు దహనం


నమస్తే తెలంగాణ దినపత్రికను దహనం చేసిన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

కాంగ్రెస్ ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకొచ్చే విధంగా కల్పిత రాతలు రాస్తూ తెలంగాణ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్న నమస్తే తెలంగాణ పత్రిక యాజమాన్యంపై నాన్ బెయిలబుల్ సెక్షన్లను నమోదు చేసి కఠినంగా శిక్షించాలని పిసిసి అధికార ప్రతినిధి బాస వేణుగోపాల్ యాదవ్ ప్రభుత్వాన్ని కోరారు. రెండు రోజుల క్రితం బేగంపేట్ విమానాశ్రయంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టిడిపి అధ్యక్షులు చంద్రబాబునాయుడు రహస్యంగా భేటీ అయ్యారని, రహస్య చర్చలు జరిగాయని నమస్తే తెలంగాణ దినపత్రికలో వచ్చిన వార్తలను ఖండిస్తూ ఆదివారం మండల కేంద్రంలోని హస కొత్తూర్ చౌరస్తా వద్ద 63వ నంబరు జాతీయ రహదారిపై నమస్తే తెలంగాణ దినపత్రికలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దహనం చేశారు. ఈ సందర్భంగా పిసిసి అధికార ప్రతినిధి బాస వేణుగోపాల్ యాదవ్ మాట్లాడుతూ.. కేసీఆర్ గురువు చిన్న జీయర్ స్వామి కలలోకి వచ్చి చెప్పినట్లు కేసీఆర్ దినపత్రిక అయిన నమస్తే తెలంగాణ పత్రికలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకొచ్చేవిధంగా

కల్పిత రాతలు రాసిన ఆపత్రికను కాంగ్రెస్ పార్టీ నాయకులు బహిష్కరించాలన్నారు. కేసీఆర్‌కు, కేటీఆర్‌కు బీఆర్ఎస్ ప్రభుత్వం పోయిన తర్వాత మతిభ్రమించి ఏం చేయాలో తోయక కాంగ్రెస్ ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకొచ్చే విధంగా తన గుమాస్త పత్రికలో కల్పిత రాతలు రాస్తూ తెలంగాణ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారన్నారు. తప్పుడు వార్తలతో ప్రజలను మోసం చేస్తున్న నమస్తే తెలంగాణ పత్రిక యాజమాన్యంపై నాన్ బెయిలబుల్ సెక్షన్లను నమోదు చేసి కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని కోరారు. నమస్తే తెలంగాణ పత్రికలో వచ్చిన వార్తల వెనుక ఆంధ్ర ముఖ్యమంత్రి జగన్ కుట్ర కూడా ఉందేమోనని అనుమానం వ్యక్తం చేశారు. కేసీఆర్ కు, జగన్ ఆప్త మిత్రుడని వీరిద్దరూ కలిసి తెలంగాణలో రాజకీయ అలజడులు సృష్టించి, గజ దొంగల్లా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అధికారం పోయినప్పటి నుంచి తండ్రి కొడుకులు ఆడుతున్న మైండ్ గేమ్ రాజకీయాలను తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని, అసలు బేగంపేట ఎయిర్ పోర్ట్ కి గురువారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

వెళ్లక పోయిన, వెళ్లినట్లు ఊహాజనితంగా రాతలు రాయించడం మానుకోవాలని కేసీఆర్, కేటీఆర్ లకు హితవు పలికారు. చంద్రబాబును కలవాల్సిన కర్మ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డిసిసి అధికార ప్రతినిధి ఏలేటి గంగాధర్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు పడిగల ప్రవీణ్, పాలెపు నరసయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు రేవతి గంగాధర్, ఉట్నూర్ ప్రదీప్, జగదీశ్ చారి, వైస్ గంగారెడ్డి, అవారి సత్యం, బోనగిరి లక్ష్మణ్, గణేష్ గుప్తా, శశి, తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న చిన్నారులు


పక్షులకు నీరు ఏర్పాటు చేస్తున్న చిన్నారులు

నవతెలంగాణ-మోపాల్

వేసవి కాలం వచ్చింది.. పక్షుల దాహం తీర్చి ప్రాణం కాపాడండి. ఎండలు ఎక్కువగా ఉన్నందువల్ల మనం ఇంట్లోనే ఉండలేక పోతున్నాం. మరి పక్షులు గురించి ఆలోచించండి. గొంతు తడుపుకునేందుకు పక్షుల కోసం మీ ఇంటి బయట లేదా.. మీ ఇంటి అవరణలో కొన్ని నీళ్ళు గుప్పెడు గింజలు పెట్టండి. చాలా పక్షులు నీళ్ళు దొరకక చచ్చిపోతున్నాయి. దయచేసి మట్టి పాత్రలో ఇంటి అవర్దలో నీళ్ల, గింజలు పెట్టి పక్షుల ప్రాణాలు కాపాడి జీవితాన్ని ఇవ్వండి అని మొపాల్ గ్రామానికి చెందిన అంగలి నవీన్ రెడ్డి, జ్యోతి, చిన్నారులు అక్షర, ఆకృతి, హరిణి, హాస్య, కన్నయ్య, లక్కీ కోరారు. చిన్నతనంలోని పెద్ద మనస్సుతో ఆలోచించి మిగతా పిల్లలకు వారు ఆదర్శంగా నిలుస్తున్నారు. పక్షులకోసం ఇంటి డాబాపైన, చుట్టుపక్కల గల పశువుల దాహార్తి తీర్చే విధంగా చూడాలని వారు కోరుతున్నారు.

సిమెంట్ డ్రైన్ పనులు పరిశీలన



నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని గొల్లపేట ఇందిరమ్మ కాలనీలో జరుగుతున్న సిమెంట్ మురుగు కాలువల నిర్మాణం పనులను కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం పరిశీలించారు. ఇందిరమ్మ కాలనీలో కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇంచార్జి ముత్యాల సునీల్ కుమార్ సహకారంతో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో సిమెంటు మురుగు కాలువలను నిర్మాణం పనులను చేపట్టారు. నిర్మాణం పూర్తయిన మురికి కాలువలను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఆధ్వర్యంలో పరిశీలించారు. నాణ్యతతో నిర్మించి, మంచిగా క్యూరింగ్ చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.

చేపలు పట్టేందుకు వెళ్లి ఒకరు మృతి

- రామచంద్రపల్లిలో విషాదం

నవతెలంగాణ-మాక్లూర్

ఆలూర్ మండలంలోని రామచంద్ర పల్లి గ్రామంలో చేపలు పట్టేందుకు వెళ్లిన వ్యక్తి చెరువులో శవమై తేలిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రామచంద్ర పల్లి గ్రామానికి చెందిన నవీన్ (30)శనివారం సాయంత్రం చేపలు పట్టడానికి చెరువులోకి వెళ్లాడు. చేపలు పడుతూ లోనికి వెళ్లాడు. రాత్రి సమయానికి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. ఉదయం చెరువులో మృతదేహం లభించింది. మృతునికి ఇంకా పెండ్లి కాలేదని, గతంలో నవీన్ తండ్రి కూడా ఇలాగే చెరువులో పడి చనిపోయినట్టు స్థానికులు తెలిపారు.

అయోధ్యకు పాదయాత్రగా వెళ్తున్న స్వామీజీ

- ఘనస్వాగతం పలికిన గ్రామస్తులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

2016లో కర్ణాటక ఉడిపి మఠం నుండి అయోధ్య వరకు పాదయాత్ర చేపట్టిన లక్ష్మీపతి స్వామీజీ ఆదివారం మండల కేంద్రానికి చేరుకున్నారు. ఆయనకు స్థానిక ఆర్య వైశ్యులు, యువకులు ఘన స్వాగతం పలికారు. లక్ష్మీపతి స్వామీజీ పాదయాత్ర చేపట్టి 7 సంవత్సరాలు గడిచినట్లు తెలిపారు. కర్ణాటక, ఆంధ్ర ప్రదేశ్, తమిళనాడు, కేరళ, తెలంగాణ మీదుగా అయోధ్య వరకు పాదయాత్ర సాగుతున్నట్లు వివరించారు. స్వామీజీ 30 సంవత్సరాల క్రితం తన ఒక కిడ్నీ ని కూడా ఒకరికి దానం చేసినట్లు తెలిపారు. రోజుకు 25 నుంచి 30 కిలోమీటర్లు మేరా పాదయాత్ర కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. మండల కేంద్రానికి విచ్చేసిన స్వామీజీకి కావలసిన భోజన, విశ్రాంతి సౌకర్యాలను ఆర్యవైశ్యులు కల్పించారు.

మహిళలపై జరుగుతున్న దాడులను ప్రతిఘటిద్దాం

- పిఓడబ్ల్యూ జిల్లా ఉపాధ్యక్షురాలు ఎం.సత్తెక్క పిలుపు


మాట్లాడుతున్న పిఒడబ్ల్యూ జిల్లా ఉపాధ్యక్షురాలు సత్తెక్క

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

అంతర్జాతీయ మహిళా పోరాట దినం స్ఫూర్తితో దేశంలో మోడీ అనుసరిస్తున్న మతోన్మాద ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని, మహిళలపై జరుగుతున్న అన్ని రకాల దాడులను ప్రతిఘటించాలని ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు ఎం. సత్తెక్క పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని హస కొత్తూర్ గ్రామంలో ప్రగతిశీల మహిళా సంఘం (పిఓడబ్ల్యు) హస కొత్తూర్ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో మండలనాయకురాలు కే. శోభ అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవం వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు సతేక్క మాట్లాడుతూ.. మహిళ హక్కుల కోసం, అంతర్జాతీయ శ్రామిక మహిళ హక్కుల పోరాట దినోత్సవాన్ని స్ఫూర్తిగా తీసుకొని శ్రామిక మహిళలందరూ పోరాటాలకు సిద్ధపడాలని పిలుపును ఇచ్చారు. అన్ని వర్గాల స్త్రీల పట్ల ఇంట, బయట తీవ్ర వివక్షత, పురుష దురహంకార దాడులు కొనసాగుతూ పురుషాధిపత్యం రాజ్య మేలుతున్నదని అన్నారు. స్త్రీని ఒక వ్యాపార వస్తువుగా పెట్టుబడిదారి వ్యవస్థ సమాజం పరిగణిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. పేద, దళిత, ఆదివాసి, మైనార్టీ స్త్రీలపై దోపిడీ, అణిచివేత, లైంగిక దాడులు, వరకట్న దురాచారాలు, ప్రేమ పేరుతో జరిగే దాడులు, దౌర్జన్యాలు రోజు రోజు పెరిగిపోతున్నాయన్నారు. వీటికి వ్యతిరేకంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. మహిళాలను మరింత అణిచివేతకు, దోపిడీకి గురిచేయ్యడానికి మతోన్మాధులు కుట్రచేస్తురన్నారు. అందుకే స్త్రీ హక్కుల ఉద్యమం, పితృస్వామ్యం రద్దు, వ్యక్తిగత ఆస్తి రద్దు అనే జంట లక్ష్యాలను కలిగి ఉండి ఉద్యమాలను నిర్వహించవలసిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. మహిళా కార్మికులకు భద్రతకై సమానత్వం కై మనువాదాన్ని, మతోన్మాదాన్ని పెంచి పోషిస్తూ బలోపేతం చేస్తు, కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడాలని అన్నారు. కార్యక్రమంలో సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ జిల్లా నాయకులు సురేష్, డివిజన్ నాయకులు సత్యనారాయణ గౌడ్, మండల కార్యదర్శి అశోక్,పిఓడబ్ల్యూ కమ్మర్ పల్లి మండల నాయకురాలు శోభ, గ్రామ నాయకులు లక్ష్మి, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ కార్యవర్గ సమావేశం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడు వేంపల్లి శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో మండల కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఉపాధ్యక్షులు కెపీ రెడ్డి, రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యవర్గ సభ్యులు సందీప్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యులు కొప్పు రాజేందర్, జిల్లా సాంస్కృతిక విభాగం కన్వీనర్ జగడం పోషన్న, జిల్లా ఎస్టీ మోర్చా అధ్యక్షులు కిషన్ నాయక్, మండల నాయకులు భూత్ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మైనార్టీ సెల్ మండలాధ్యక్షుడిగా అఖిల్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

డిచ్‌పల్లి మండల బిజెపి మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా మండలంలోని సుద్దపల్లి గ్రామానికి చెందిన అఖిల్‌ను ఆదివారం ఎన్నుకున్నారు. అనంతరం డిచ్ పల్లి మండల అధ్యక్షుడు వెంకటరమణ, మాజీ నిజామాబాద్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అంబదాస్ చేతుల మీదుగా నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ బిజెపి నాయకులు రవి గౌడ్, బాలయ్య, పరశురాం నాయక్,బీజేవైఎం జిల్లా కార్యదర్శి పానుగంటి సతీష్ రెడ్డి, కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు సుదర్శన్ రెడ్డి , కిరణ్ గౌడ్, తాజా మాజీ సర్పంచ్ శివారెడ్డి, మండల నాయకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
5
సోమవారం | మార్చి 11, 2024 | www.navatelangana.com

విద్యార్థులకు రక్షణ కరువు



నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో గల వినాయకుల భావి ప్రమాదానికి నిలియంగా మారింది. భావి సమీపంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు చదువుకుంటారు. ఈ పాఠశాలలో 800లకు పైగా విద్యార్థులున్నారు. అయితే విద్యార్థులు ఆడుకునే సమయంలో పలుమార్లు బావి చుట్టూ గూమిగుడి ఆడుకుంటున్నారు. దాంతో వినాయకుల బావికి ఎలాంటి రక్షణ జాలి లేకపోవడంతో అందులో పడే ప్రమాదం ఉంది. గత కొన్ని రోజుల క్రితం చెత్త కాగితాలు ఏరుకుంటూ ఓ చిన్నారి ప్రమాదకరమైన బావిలోకి దిగింది. అయినా ఎవరూ పట్టించుకోకపోవడం గమనార్హం. కావున ప్రమాదం జరగకముందే మున్సిపల్ అధికారులు వినాయకుల భావి చుట్టూ రక్షణ కంచె ఏర్పాటు చేసి ప్రమాదం జరగకుండా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-సదాశివనగర్



మండలం లోని ఉత్నూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2006-2007 సంవత్సరం పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పూర్వ ఉపాధ్యా యులను సన్మా నించారు. చదువుకున్న రోజుల్లోని జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

నాట్య మయూరి.. స్మరాసని



- డబ్బింగ్, డైలాగ్‌లు చెప్పడం, పాటలు పాడడం ప్రత్యేకత
- ఆరేళ్ల వయసులోనే పురస్కారాలు, బిరుదులు, మెడల్స్ ఆమె సొంతం
- పలువురి వేషాధారణతో అలరిస్తున్న చిన్నారి

నవతెలంగాణ-బాల్కొండ

పిట్ట కొంచెం కూత ఘనం అన్నట్టుగా ఆరేళ్ల చిన్నారి వాసన్ స్మరాసని నాట్యంపై మక్కువతో జాతీయస్థాయిలో ప్రదర్శనలిస్తూ తన కళా నైపుణ్యంతో అనేక పురస్కారాలు, బిరుదులు, ప్రశంసా పత్రాలు, మెడల్స్ సాధిస్తూ నేటి బాలలకు ఆదర్శంగా నిలుస్తుంది. నందిపేట్ మండలంలోని దత్తాపూర్ గ్రామానికి చెందిన వాసన్ రాజ్జీ - జనార్ధన్ దంపతుల మొదటి సంతానం స్మరాసని, రెండవ సంతానం శ్రేయాన్స్. వీరు ప్రస్తుతం బాల్కొండలో ఉంటున్నారు. అక్కడే శాంభవి హైస్కూల్‌లో స్మరాసని రెండవ తరగతి చదువుతుంది. తల్లిదండ్రులు తమ పిల్లల టాలెంట్‌ను చిన్నతనంలో గుర్తించి వారి ఇష్టాన్ని గుర్తించి ఆ రంగంలో ప్రోత్సహించాలని స్మరాసని తండ్రి జనార్ధన్ కోరారు. తన కూతురు స్మరాసని టాలెంట్‌ని, డాన్స్ పట్ల తన ఇష్టాన్ని గుర్తించామని అన్నారు. స్మరాసని రెండు సంవత్సరాల వయస్సు నుంచి డ్యాన్స్‌పై ఆసక్తితో బేసిక్ డాన్స్ మాస్టర్ రజిని ద్వారా నేర్చుకుంది. కరోనా లాక్ డౌన్ తర్వాత సొంతగా యూట్యూబ్ చూసి నేర్చుకుంటుంది. నివేదిత టెక్నికల్ ఇన్స్టిట్యూట్ చైర్మన్ మైలారం బాలు ప్రోత్సాహంతో తన నాట్య ప్రయాణాన్ని ముందుకు కొనసాగించింది. తన మొదటి ప్రదర్శన సరస్వతీ నిలయమైన బాసర వద్ద ప్రారంభించి జాతీయస్థాయిలో 300కు పైగా అత్యుత్తమ ప్రదర్శనలు చేసింది. క్లాసికల్ డాన్స్ లే కాకుండా వెస్ట్రన్ డాన్స్, ఫోక్ డాన్స్‌లు కూడా చేయడం ప్రత్యేకత. వసంత పంచమి సందర్భంగా నిర్మల్ జిల్లాలోని శ్రీమాతా రాజశ్యామల పీఠాధిపతి శివరాజయోగి కృష్ణ ఆధ్వర్యంలో 11 వేల మందితో చేసిన కోటి కుబేర కుంకుమార్చన కార్యక్రమంలో నాట్యంలో అత్యుత్తమ ప్రదర్శన కనబరచి అందరి మన్నలను పొందింది. ఢీ షో ఫేమ్ మణికంఠ మాస్టర్ టీంలో శ్రీదేవి డ్రామా కంపెనీ షోలో స్మరాసని డాన్స్ చేసింది.

ప్రముఖుల ప్రశంసలు

మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి, మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, ఎంపీ ధర్మపురి అరవింద్, మైనంపల్లి హనుమంతరావు, నైన్ స్టేజ్ మాస్టర్ వంశీ ప్రతాప్ గౌడ్, పల్లిగుట్ట మహారాజ్, శివరాజయోగి కృష్ణ, వీళ్లే కాకుండా ఇంకా ఎందరో సినీ తారలు చిన్నారి స్మరాసనిని ప్రశంసించారు.

సోషల్ మీడియా ఐడిలో నమోదు

ఇన్స్టాగ్రామ్ , యూట్యూబ్‌లలో స్మరాసని చేసిన ప్రదర్శనలను Tiny_dancer0902 ఈ ఐడిలో నమోదు చేస్తామని, ప్రేక్షకులు ఈ ఐడిని వీక్షించి తన కూతురిని ప్రోత్సహించాలని స్మరాసని తల్లి రాజ్జీ కోరారు. చిన్న వయసు నుంచి ఒక ఆడపిల్ల పాటలు పాడటం, డబ్బింగ్ చెప్పడం, క్లాసికల్ డాన్స్, కూచిపూడి డాన్స్, ఫోక్ డాన్స్‌లే కాకుండా సోషల్ మీడియా యూట్యూబ్, ఇన్స్టాగ్రామ్ ఇలా ఏది వదలకుండా తన ప్రయత్నంతో ముందుకు కొనసాగుతుంది. ప్రస్తుతం ఒక సినిమాలో ముఖ్యమైన పాత్రలో నటిస్తుంది. ఆరు సంవత్సరాల చిన్నారి తన టాలెంట్‌తో ఎంతో రాణిస్తుంది, భవిష్యత్తులో ఎంతో ఎదిగి మల్టీ టాలెంటెడ్ గర్ల్‌గా గుర్తింపు తెచ్చుకోవాలని ఆకాంక్షిద్దాం.

ప్రత్యేక ప్రదర్శనలు

శివరాత్రి సందర్భంగా శ్రీమాతా రాజశ్యామలదేవి పీఠం నిర్మల్ సిద్ధగురువు శివరాజియోగి ఆధ్వర్యంలో దాదాపు 33 వేల మందితో " మృత్యుంజయ మహా మంత్ర కోటి పారాయణం" కార్యక్రమంలో పాల్గొంది. అక్కడ శివుడి వేషధారణలో ప్రత్యేక ప్రదర్శన చేసి అందరినీ అబ్బురపరిచింది.



తల్లిదండ్రులతో..

స్మరాసని పొందిన బిరుదులు

నాట్యనందిని, నాట్య నయని, నాట్య మయూరి, జాతీయ నాట్య జ్యోతి, నాట్య సరస్వతి, కళా దీప్తి, నాట్య రవళి, బాలనాట్యరత్న, నాట్య కుసుమం, శివశూలం, కళారత్నం.. ఇలాంటి బిరుదులు పాత్రకు తగ్గట్టుగా ఆమె సొంతం చేసుకుంది.

స్మరాసని ప్రత్యేకతలు

చిన్న వయసు నుంచే డబ్బింగ్ చెప్పడం, పాటలు పాడటం, లెన్త్ డైలాగులను తడబడకుండా చెప్పడం, ప్రదర్శన కార్యక్రమంలో ఎంత మంది ఉన్నా భయపడకుండా ప్రదర్శించడం చిన్నారి స్మరాసని ప్రత్యేకత. ఆమె ప్రదర్శన సమయంలో చేసే ఎక్స్‌ప్రెషన్స్‌తో ఆ పాత్రల్లో లీనమైపోవడం, ప్రతి పాత్రకు తగ్గట్టుగా స్మరాసని తల్లి రాజ్జీనే ప్రత్యేక కాస్ట్యూమ్ వస్త్రాలంకరణ చేస్తుంది. చిన్నారి వేసే గెటప్‌లో జిజియాబాయి, శ్రీకృష్ణుడు, రాజశ్యామలాదేవి, కాళికామాత గెటప్‌లో సాక్షాత్తు అమ్మవారి లాగా కనిపించడం. స్మరాసని ప్రతి పాత్రకు తగ్గట్టు ఆమె చిన్నమామయ్య వివేకానంద్ తయారుచేసిన కాస్ట్యూమ్ ప్రాపర్టీస్ చాలా ప్రత్యేకంగా ఉంటాయి.



పురస్కారాలు, మెడల్స్‌తో స్మరాసని



అమ్మవారి అవతారంలో చిన్నారి

జాతీయస్థాయి బాల్ బ్యాట్మెంటన్ పోటీలకు తెలంగాణ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

నవతెలంగాణ-కంఠేశ్వర్





సికింద్రాబాద్ ఎస్ రావు నగర్ నందు నిర్వహించిన ఎంపికల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను తెలంగాణ రాష్ట్ర జట్టుకు సన్నద్ధత శిబిరానికి ఎంపిక చేయడం జరిగింది. ఇందులో నిజామాబాద్ జిల్లా క్రీడాకారులు ఉదయకిరణ్, స్ఫూర్తి తెలంగాణ జట్టుకు ఎంపిక అయ్యారు. వీరు ఈనెల 11వ తేదీ నుండి 16వ తేదీ వరకు బీహార్ లోని పాట్న జిల్లాలో జరిగే 68వ జాతీయస్థాయి జూనియర్ బాల్ బ్యాట్మెంటన్ క్రీడా పోటీలకు తెలంగాణ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారు. జిల్లా క్రీడాకారిని ఎంపిక కావటం పట్ల జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షులు మానస గణేష్, ప్రధాన కార్యదర్శి శ్యామ్,వర్కింగ్ ప్రెసిడెంట్ రమణ, సలహాదారులు ఎన్వి హనుమంత్ రెడ్డి,జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష కార్యదర్శులు విద్యాసాగర్ రెడ్డి, మల్లేష్ గౌడ్ ఉపాధ్యక్షులు కిషన్, కోశాధికారి రాజేశ్వర్, కృష్ణమూర్తి సంఘ సభ్యులు అభినందించారు.

కమనీయాలు కాసర్ల రుబాయిలు



రుబాయిరాగాలు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

మూడు దశాబ్దాలుగా నిరంతర సాహిత్యకృషి చేస్తూ, పది పుస్తకాలు విభిన్న సాహిత్యప్రక్రియలలో రచించిన డా.కాసర్ల ప్రస్తుతం రుబాయి ప్రక్రియలో రుబాయిరాగాలు పుస్తకం తీసుకురావడం చాలా ప్రత్యేకమైనదని, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోనే ఈ రుబాయి ప్రక్రియలో వచ్చిన తొలిపుస్తకం ఈ రుబాయిరాగాలు అని ప్రముఖ గజల్ కవి సూరారం శంకర్ అన్నారు. ఆదివారం నిజామాబాద్ నగరంలోని మున్నూరు కాపు సంఘం లో డా.కాసర్ల రచించిన "రుబాయిరాగాలు" పుస్తక పరిచయసభ నిర్వహించారు. ఇందూరుయువత స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షులు డా.మద్దుకూరి సాయిబాబు ఆహ్వానం పలికిన ఈ సభకు సభాసామ్రాట్ వి.పి.చందన్ రావు అధ్యక్షత వహించారు. ఈసభలో విశిష్టఅతిథులుగా సెంట్రల్ యునివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డా.త్రివేణీ మాట్లాడుతూ కమనీయ కవిత్వాన్ని అందించిన కాసర్ల రుబాయిలు చరిత్రలో నిలిచిపోతాయన్నారు. గిరిరాజ్ కళాశాల అసిస్టెంటు ప్రొఫెసరు డా.బోయిన్ పల్లి ప్రభాకర్ మాట్లాడుతూ.. డా.కాసర్ల, ఇందూరు జిల్లా కవిత్వంలో మణికిరీటధారి అని, కవనకిరీటి అందుకే అయ్యాడని అన్నారు. ఈ సభలో విశిష్ట అతిథులుగా తెలంగాణభాషలో తొలిపుస్తకం ఇసిత్రం కవి పంచరెడ్డిలక్ష్మణ్, గుండారం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.అమర్ నాథ్, పుస్తకాన్ని అందంగా కూర్చిన ప్రముఖకవి, చిత్రకారులు చింతల శ్రీనివాస్ గుప్త పాల్గొన్నారు. ఈ సభలో రుబాయిరాగాలు ముఖపుస్తక కర్త సూరారం శంకర్‌ను, అతిథులను, కాసర్ల కవిని ఘనంగా ఇందూరుయువత కార్యవర్గం ఘనంగా సత్కరించారు. ఈ సభలో కవులు దారంగంగాధర్, డా.బలాష్ట మల్లేశ్, గంట్యాలప్రసాద్, రాంనరేశ్, డా.శారద, కందకుర్తి ఆనంద్, వసంత, లక్ష్మణ్, గణపురం వెంకటేశ్, ఆల్గోట్ గంగాధర్, సమత, స్వప్న, ఇందిర, మల్లవరపు చిన్నయ్య ధనుంజయ, సారాపురం సురేందర్ ,పి.లక్ష్మణ్ ,పురుషోత్తమాచార్యభట్టు శ్రీధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిబంధనల అమలు ఎక్కడ..?

- ఆర్టీఏ అధికారుల తనిఖీలు కరువు
- వాహనదారుల ఇష్టారాజ్యం
- అధిక లోడుతో వెళ్తున్నా.. పట్టించుకోని వైనం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

లారీలు, టిప్పర్లు, ట్రాక్టర్లు ఆర్టీఏ నియమ నిబంధనలు తుంగలో తొక్కుతూ ఇష్టారాజ్యంగ అధిక లోడు నింపుకుంటూ ప్రజలకు చిన్న వాహనదారులకు ఇబ్బందులు కలగజేస్తున్నారు ఇంత జరుగుతున్న రవాణాశాఖ అధికారులు చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.డిచ్ పల్లి, ఇందల్ వాయి తోపాటు అనేక మండలాల్లో కంకర క్వారీలు వెలిశాయి. నిజామాబాద్ పట్టణం తోపాటు, మండలాల్లో నూతనంగా గృహాలు, ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర పనులు కోసం గృహానికి, ఇతర వాటికి అవసరమైన ఇసుక, మొరం, ఇటుకలు, హైడర్లు, ఉనక ఇతరత్రా వస్తువులు క్వారీల నుండి వాహనాల్లో ఎక్కువ మోతాదులో తీసుకుని వెళ్ళవద్దని నిబంధనలు ఉన్నాయి. ఆ నిబంధనలు తుంగలో తొక్కుతూ కంపెనీ, షోరూం నుండి వచ్చే వాహనాల బాడీని కొద్దిగా పెంచుకుంటూ వస్తువులను తగ్గిస్తూ ఉంటారు. తరలించేటప్పుడు ఆ వస్తువుపై తాడిపత్రి తదితర వాటిని కప్పుకుని వెళ్ళవలసి ఉంటుంది. కానీ అలాంటి నిబంధనలు పాటించకుండానే కంకర, ఇసుక తదితర వాటిని తీసుకొని వెళ్తున్నారు. దీంతో వెనుక నుండి వస్తున్న వాహనాలపై ఇసుక, కంకర వంటివి పడడంతో ప్రమాదాలను కొని తెచ్చుకుంటున్నారు. ఇలాంటి వాటిని రవాణా శాఖ అధికారులు పట్టుకొని జరిమాని విధించవలసి ఉంటుంద.ఇ రవాణా శాఖ అధికారులు రహదారులపై తనిఖీలు చేయడమే మరిచిపోయారని పలువురు ద్విచక్ర వాహనదారుల విమర్శిస్తున్నారు.

డిచ్‌పల్లి, ఇందల్‌వాయి మండల కేంద్రాల నుండి ధర్పల్లి వైపు నుండి అనునిత్యం కంకర నగరానికి తరలిస్తున్నారు.



అధిక లోడుతో హైవేరోడ్డునుంచి వెళ్తున్న లారీ



అధిక లోడుతో గ్రామంలో నుంచి వెళ్తున్న లారీ

ఇలాంటి నిబంధనలను ఏ ఒక్క యజమాని పాటించిన దాఖలాలు కనిపించడం లేదు, వారి వెనుక వచ్చే వాహన దారులపై కంకర ఇసుక దుమ్ముధూళిపడి లేని ప్రమాదాలను కొని తెచ్చుకుంటున్నారు. ఆ వాహనదారులను అడిగినా ఇష్టరాజ్యంగా వ్యవహరిస్తున్న రవాణా శాఖ అధికారులు మాత్రం తమకేమీ పట్టినట్లు ఉంటున్నారని పలువురు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జాతీయ రహదారి కాకుండా మండల కేంద్రాల నుండి గ్రామాలకు వెళ్లే రహదారుల వెంట ఇరువైపులా దుమ్ముదు నిండి ఉంటుంది. దానికి తోడు ఈ వాహనదారులు రాకపోకలు సాగించేటప్పుడు దుమ్ము ధూళితో పాటు వాహనంలో తరలిస్తున్న కంకర, డస్ట్, కంకర, ఇసుక వాహనలపై పడడమే కాకుండా రహదారిపై కూడా పడుతుంది. నిబంధనల మేరకు ఏదైనా వస్తువు కప్పుకొని తీసుకొని వెళ్లవలసి ఉంటుంది. కానీ ఇక్కడ తమకు అడ్డు అదుపు ఎవరిని ధీమాతోనే వాహన దారులు ఇష్టారాజ్యంగా చేస్తున్నారు. అధిక బరువుతో వెళ్లే వాహనాలను రవాణాశాఖ అధికారులు పట్టుకొని జూరుమనలు విధించేవారు. కానీ ఆర్టీఏ అధికారులు కూడా ఏదో ఒక జాతీయ రహదారిపై ఎప్పుడో ఒకసారి తనిఖీలు చేస్తూ ఉంటున్నారని, కంకర, ఇసుక, డస్ట్‌లతో తరలుతున్న వానాలను పట్టించుకోవడంలేదని, దానికి సరైన పత్రాలు లేకున్నా అడిగే నాథుడే కరువైనట్లు విమర్శలు లేకపోలేదు. ఇకనైనా రవణ శాఖ అధికారులు స్పందించి నిబంధనలు అతిక్రమించి రాకపోకలు సాగిస్తున్న వాహనాలపై కఠిన చర్యలు తీసుకొని నిబంధనలు అమలు చేసే విధంగా చూసే బాధ్యత ఉందని పలువురు పేర్కొంటున్నారు.

పీఎఫ్ కార్యాలయం ముందు ధర్నాను జయప్రదం చేయండి

ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై . ఓమయ్య



మాట్లాడుతున్న ఓమయ్య

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

పీఎఫ్ కార్యాలయం ముందు జరిగే ఏఐటీయూసీ ధర్నాను జయప్రదం చేయండి అని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై . ఓమయ్య అన్నారు. ఏఐటీయూసీ బీడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బీడీ కార్మికులకు కనీస పెన్షన్ 6000 రూపాయలకు పెంచాలని, ఆన్లైన్ సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని, నామిని పెన్షన్ అమలు చేయాలని, ఆర్‌ఓసీ సమస్యను పరిష్కరించాలని, తదితర డిమాండ్లతో సోమవారం నిజామాబాద్ బీడీ కమిషనర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. జిల్లాలోని బీడీ కార్మికుల పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా కోరారు. ఈ సమావేశంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి భాను చందర్, నాయకులు సాయమ్మ, సౌందర్య, బాలరాజు, రూప తదితరులు పాల్గొన్నారు.

పసుపు ధరలు పైపైకి

- ఎంపీ ధర్మపురి అరవింద్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

పసుపు రైతుల మొహాల్లో ఇప్పుడిప్పుడే ఆనందం కనబడుతుందని, అప్పుడప్పుడో 2011లో 16000 దాటిన పసుపు ధర ఇప్పుడు ఆల్ టైం రికార్డులను బద్దలు కొట్టిందని నిజామాబాద్ పార్లమెంటు సభ్యుడు ధర్మపురి అరవింద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గత వారం రోజుల క్రితం నిజామాబాద్ మార్కెట్ యార్డులో పసుపు ధర క్వింటాలుకు రికార్డు స్థాయిలో రూ.17,011 పలకడం పట్ల రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని వివరించారు. వేల్పూర్ మండలం అంక్సాపూర్ గ్రామానికి చెందిన పోడోళ్ళ రాజు రైతుకు సాంగ్లీ మార్కెట్లో రూ.17,503 ధర పలకగా, నిన్న అదే గ్రామానికి చెందిన పాశపు మహేష్ అనే రైతుకు అదే మార్కెట్లో రూ.18,900 ధర పలకడం విశేషమని పేర్కొన్నారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు మహబూబ్ నగర్ సమావేశంలో ప్రధాని మోడీ తెలంగాణ రాష్ట్రానికి పసుపు బోర్డు ప్రకటన మంజూరు చేయించడం, వెంటనే క్యాబినెట్‌లో ఆమోదం తెలపడం, పసుపు బోర్డుకు సంబంధించి గెజిట్ కూడా విడుదలవడం తెలిసిందేనని సూచించారు. ఈ ప్రకటనతో పసుపు ధరలు గత ఏడాదితో పోల్చుకుంటే ఒక్కసారిగా పెరిగాయని వివరించారు. పసుపు సాగు విస్తీర్ణం గత ఐదేళ్లలో దేశవ్యాప్తంగా పెరిగిందని తెలిపారు. 2018-19లో 6,46,947 ఎకరాలు సాగు కాగా, 2022-23లో 8,04,259 ఎకరాలకు సాగు విస్తీర్ణం పెరిగిందని, గత ఐదేళ్లలో 1,57,312 ఎకరాల పెరిగినప్పటికీ పసుపు ధరలు మాత్రం అమాంతంగా పెరుగుతున్నాయని వివరించారు. గత బిఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు పసుపు రైతులను నట్టేట ముంచాయని, సేంద్రీయ ఎరువుల ధరలు, కూలీఖర్చులు మహారాష్ట్రతో పోల్చుకుంటే మూడింతలు ఉండడం, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించలేక, వేలాదిమంది యువ రైతులు గల్ఫ్ దేశాలకు వలస వెళ్లడం తదితర కారణాల వల్ల జిల్లాలో సాగువిస్తీర్ణం తగ్గిందని కానీ దేశీయంగా మాత్రం సాగు విస్తీర్ణం పెరిగిందని తెలిపారు.

డిపిఓ సారు.. మా సమస్యను పరిష్కరించండి

- చింరాజ్‌పల్లి బాధితుల ఆవేదన
- అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు
- ప్రజావాణిలో ఫిర్యాదు
- 9నెలలైనా పరిష్కారం కాని సమస్య

నవతెలంగాణ నిజామాబాద్ సిటీ

డిపిఓ సారు... మా సమస్యను పరిష్కరించండి... నివాస స్థలం కోసం ప్రభుత్వం స్థలం కేటాయించింది, అయినా నాయకులు దౌర్జన్యం చేస్తూ గుడిసె వేసుకొని ఉండనిస్తలేరు, అక్కడ మేము గుడిసెలు వేసుకున్న వచ్చి ఇబ్బంది పెడుతున్నారు అని బాధితులు ప్రజావాణిలో అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇప్పటికీ ఆ ఫిర్యాదుకు ఎటువంటి ఫలితం లేకుండా పోయింది. కనీసం కొత్తగా వచ్చిన డిపిఓ సారైనా మా సమస్యనైనా పరిష్కరించి, న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు. గత సంవత్సరం జూన్‌లో ఫిర్యాదు చేసిన ఇప్పటికీ సమస్య పరిష్కారమే కాలేదని అంటున్నారు. మా ఊర్లో ఉన్న రాజకీయ నాయకులకు మాత్రం పెద్ద పెద్ద ఇల్లు కట్టుకోవడానికి అనుమతి అయితే ఇచ్చారు. ఇంకెప్పుడు మా సమస్యను పరిష్కరిస్తారు సార్ అని అడుగుతున్నారు. ఇక్కడ ఉన్న అధికారి పట్టించుకుంటలేరు సార్.. సర్వే నంబర్ 40/7/1 ఉన్న స్థలంలో ఇప్పటి దాకా ఏ అధికారి మాకు ఉన్న స్థలం కచ్చితంగా వచ్చి చూసింది లేదు, మా సమస్యకు పరిష్కారం చేసింది లేదు.. ఇంకెప్పుడు చేస్తారు సార్, కొంచెం దయ ఉంచండి సార్. నందిపేట్ మండలం చింరాజ్‌ల్లి శివారులో గతం లో ప్రభుత్వం స్థలం కేటాయించింది అయినా ఖచ్చితమైన స్థలం చూపించి కనికరించండి సార్ అని బాదితులు కోరుతున్నారు. గతంలో ఉన్న పై అధికారులు మాకు న్యాయం చేయాలేదు, ఇప్పుడు ఉన్న అధికారి అయినా న్యాయం చేసేనా అని బాదితులు అంటున్నారు. గతంలో ఉన్న అధికారి ప్రజాప్రతినిధులకు వత్తాసు పలుకుతూ న్యాయం చేయలేదని మొర పెట్టుకుంటున్నారు.



గ్రామంలోని అసైన్డ్ స్థలం

ప్రభుత్వ స్థలమైనప్పటికీ ప్రజాప్రతినిధులకు ఇండ్లు కట్టుకునేందకు ఇంటి నంబర్లు ఏ విధంగా పంచాయతీ అధికారులు ఇచ్చారు. మరి అదే స్థలం లో సామాన్య ప్రజలకు ఇంటి నెంబర్ ఏ విధంగా చెల్లుబాటు కాలేదు అనే అంశాన్ని కూడా జిల్లా పంచాయతీ అధికారులు కులం కుశంగా విచరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. జిల్లా పంచాయతీ అధికారి క్షుణ్ణంగా పరిశీలిస్తే గాని అసలు విషయం బయటకు రాదని బాధితులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

ఎమ్మెల్యే రమణారెడ్డిని అవమానించొద్దు

నవతెలంగాణ-దోమకొండ

ఎమ్మెల్యే రమణారెడ్డిని అవమానించొద్దని బీజేపీ నాయకులు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని బిజెపి పార్టీ కార్యాలయంలో బీజేపీ మండల అధ్యక్షులు చింతల రాజేష్ ఆధ్వర్యంలో నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాజీ మంత్రి మహ్మద్ షబ్బీర్ అలీ గతంలో రెండు సార్లు గెలిచి, ఐదుసార్లు ఓటమిపాలై ప్రజలు తనను అవసరం లేదనుకున్నా.. అధికార దాహం కోసం పదవులను తెచ్చుకొని కామారెడ్డి నియోజకవర్గంలోనే ప్రోటోకాల్ పాటించాల్సిన అవసరం లేదని అన్నారు. షబ్బీర్ అలీతో పాటు మరో ముగ్గురికి ప్రభుత్వ సలహాదారు పదవులను రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. వారికి ఎక్కడా లేని ప్రోటోకాల్ కామారెడ్డిలోనే మహ్మద్ షబ్బీర్ అలీకి ఎందుకని అన్నారు. మరొక్కసారి తమ నాయకుడికి ప్రోటోకాల్ పట్ల అవమానపరచడం జరిగితే గ్రామస్థాయి నుంచి కామారెడ్డి జిల్లా కేంద్రంలోని పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి రవీందర్‌రెడ్డి, కిసాన్ మోర్చా మండలాధ్యక్షులు అనుపటి నరేందర్, పట్టణ అధ్యక్షులు మద్దూరు భూపాల్, నారాయణ, ఎస్పాల్‌రెడ్డి, యూత్ అధ్యక్షులు తిప్పపూర్ రవి, విఠల్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, వేణు, నర్సింలు, శ్రీనివాస్ పాల్గొన్నారు.